

గబ్బాడలో ఇసుక విక్రయాలు ప్రారంభం

నర్సీపట్నం , అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గబ్బాడ ఇసుక డిపోలో శనివారం సాయంత్రం మైనింగ్ ఏడీ శివాజీ ఇసుక విక్రయాలను ప్రారంభించారు. ఇసుక ధర టన్ను రూ.1165లుగా నిర్ణయించారు. www.sand.ap.gov.in వెబ్‌సైట్‌లో, లేదా మాన్యువల్‌లో కూడా బుక్ చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఇసుకను సొంత వాహనంలో, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనంలో కూడా తీసుకువెళ్లవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంటకరమణ, కౌన్సిలర్లు డబ్బీరు శ్రీకాంత్, దనిమిరెడ్డి మధు, ఈర్లి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణ ధర తగ్గింపుపై మండిపాటు

విశాఖ డెయిరీపై పాడిరైతుల ఆగ్రహం

- దాణా, పశుగ్రాసం ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఆదుకోవలసిందిపోయి ధర తగ్గించడంపై నిరసన
- ఇప్పటికే బోనస్‌లు, ఇతర రాయితీల్లో కోత
- సేకరణ ధర యథాతథంగా కొనసాగించాలని డిమాండ్
- పలు పాల కేంద్రాల వద్ద రైతుల ఆందోళన


నరసయ్యపేట విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న పాడిరైతులు

చోడవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): **విశాఖ డెయిరీ పాల సేకరణ ధరను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంపై పాడిరైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పశువుల దాణా, ఇతర ఖర్చులు పెరిగిపోయిన నేపథ్యంలో పాల సేకరణ ధరను పెంచి రైతులను ఆదుకోవలసిందిపోయి ధరను తగ్గిస్తూ విశాఖ డెయిరీ యాజమాన్యం నిర్ణయం తీసుకోవడంపై మండిపడుతున్నారు.**

విశాఖ డెయిరీకి రైతులు సరఫరా చేసే ఆవు పాలను లీటరుకు సుమారుగా రూ.4 నుంచి రూ.5ల వరకు తగ్గిస్తూ విశాఖ డెయిరీ యాజమాన్యం నిర్ణయం తీసుకోవడాన్ని పాడి రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం విశాఖ డెయిరీ ఇస్తున్న ధరలే తమకు గిట్టుబాటు కావడం లేదని, ఈ పరిస్థితుల్లో ధర పెంచాల్సిందిపోయి ఉన్న ధరలను కూడా తగ్గించడాన్ని రైతులు నిలదీస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము ప్రైవేటు డెయిరీలకు వెళ్లిపోతామని హెచ్చరిస్తున్నారు. డెయిరీ తీసుకున్న పాల సేకరణ ధర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పాల సంఘాల వద్ద పాలు పోయడానికి నిరాకరిస్తూ ఆందోళనలకు దిగుతున్నారు. పలు చోట్ల విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రాల వద్ద పాడి రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. ఇప్పటికే విశాఖ డెయిరీ పాడి రైతులకు ఇచ్చే బోనస్‌లు తగ్గించేసిందని, చనిపోయిన రైతులకు ఇచ్చే రాయితీలను కూడా కుదించేసిందని, ఇప్పుడు పాల సేకరణ ధర కూడా తగ్గించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పశువుల దాణా రేట్లు, పశుగ్రాసం రేట్లు పెరిగిపోయి పశువుల పెంపకం భారంగా మారిందని, ఈ పరిస్థితుల్లో పాల సేకరణ ధర పెంచాల్సిందిపోయి తగ్గించడమేమిటంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. ఆవుపాలకు ధర ఇవ్వలేమని, గేదె పాలే సరఫరా చేయాలని యాజమాన్యం చెబుతున్నదని, ప్రస్తుతం గేదెల రేట్లు రైతులకు అందుబాటులో లేవని రైతులు అంటున్నారు. ఈ ఆవులను ఇచ్చేసి లక్ష, లక్షా 50వేల రూపాయలు వెచ్చించి గేదెలు ఎక్కడ నుంచి తేగలమని రైతులు వాపోతున్నారు. గేదెలు కొనడానికి ఇప్పుడు ఎక్కడ నుంచి డబ్బులు తేగలమని రైతులు వాపోతున్నారు. దాణాల రేట్లు గతంలో కంటే ఎక్కువగా పెరిగిపోయాయని, నూకల బస్తా రూ.1300 పైబడి ఉందని, ఇతర దాణాల రేట్లు కూడా ఎక్కువగానే ఉన్నాయని, ఇలాగైతే ఎక్కడ నుంచి తెచ్చి తాము పశువులను మేపగలమని రైతులు వాపోతున్నారు. నీటి సౌలభ్యం, అన్ని రకాల సౌకర్యాలతో పాటు దాణాకు కూడా భారీగా వెచ్చిస్తే తప్ప గేదెల పెంపకం చేయలేమేని, అందువల్లే ఆవులను పెంచుతున్నామని, హఠాత్తుగా ఇలా ఆవుపాల సేకరణ ధర తగ్గిస్తే తాము మరింత నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశాఖ డెయిరీ యాజమాన్యం తీసుకున్న ఈ పాలసేకరణ ధర తగ్గింపు నిర్ణయాన్ని సభ్య రైతులు తీవ్రంగా తప్పుపడుతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి పశువులను మేపినా, తమకు గిట్టుబాటు కావడం లేదని, ఎంతోకొంత డెయిరీ సహకారం అందించాల్సిందిపోయి, ఇచ్చే రేట్లను తగ్గించడమేమిటంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. పాల సేకరణ కేంద్రాల వద్ద రైతులనుంచి లీటరుకు రూ.35 తీసుకుంటున్న డెయిరీ, అదే కేంద్రంలో ఇతరులకు లీటరు రూ.80కి అమ్ముతున్నదని, దీనిని బట్టి రైతులు ఎంత నష్టపోతున్నారో అర్థం చేసుకోవాలని పాడిరైతులు అంటున్నారు. విశాఖ డెయిరీ పాల సేకరణ ధర తగ్గించడంతో పాటు ఇతర రాయితీలకు కూడా కోతలు అమలు చేయడాన్ని పాడి రైతులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇదే వైఖరి కొనసాగితే తాము ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోకతప్పదని, ప్రైవేటు డెయిరీలకు మళ్లిపోతామని హెచ్చరిస్తున్నారు.

ఖర్చులు బాగా పెరిగిపోయాయి



పశువుల దాణా ఖర్చులు భారీగా పెరిగిపోయాయి. దాణా రేట్లతో పాటు ఇతర ఖర్చులు కూడా పెరిగాయి. కానీ పాలకు ఇస్తున్న రేట్లు మాత్రం పెరగడం లేదు. పాల సేకరణ ధర పెంచి రైతులను ఆదుకోవలసిందిపోయి రైతులను ఇలా నష్టాలపాలు చేసే నిర్ణయాలు తీసుకోవడం డెయిరీ యాజమాన్యానికి తగదు.

- నడపల్లి జగ్గారావు, పాడిరైతు, నరసయ్యపేట

బోనస్‌లు కూడా తగ్గించేశారు



విశాఖ డెయిరీ గతంలో వ్యవసాయ సీజన్ ముందు ఏరువాక బోనస్‌తో పాటు, సంక్రాంతి పండగకు డబుల్ బోనస్‌లు ఇచ్చేది. ఇప్పుడు మూడు బోనస్‌లు ఎత్తేసి ఒక్క బోనసే ఇస్తున్నారు. అలాగే చనిపోయిన రైతులకు గతంలో రూ.30 వేలు ఇచ్చేవారు. ఇప్పుడు దానిని కూడా తగ్గించి ఇస్తున్నారు. ఇలా అన్నీ తగ్గించి వేయడం తప్పితే రైతులను ఆదుకోవడం కనిపించడం లేదు.

- జనపరెడ్డి జగ్గారావు, రైతు

రోడ్డునపడ్డ అభిజిత్ కార్మికులు

విద్యుత్ బకాయిలు పేరుకుపోవడం, అంతర్జాతీయ మార్కెట్లో ధరలు తగ్గడమే లేఆఫ్‌నకు కారణమంటున్న యాజమాన్యం

- కార్మికుల ఆందోళన
- వెంటనే కర్మాగారాన్ని పునఃప్రారంభించాలని డిమాండ్


అభిజిత్ కర్మాగారం

అచ్యుతాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): **అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) లో గల అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారం లేఆఫ్ ప్రకటించడంతో వందలాది మంది ఉద్యోగులు, కార్మికులు రోడ్డునపడ్డారు. రెండు నెలల్లో పరిస్థితులు చక్కబడతాయని, అప్పటివరకూ సగం జీతం ఇస్తామని యాజమాన్యం చెబుతోంది. తమకు 26 రోజుల జీతం ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.**

సెజ్‌లో అభిజిత్ కర్మాగారానికి అప్పట్లో ఏపీఐఐసీ 90.22 ఎకరాలు కేటాయించింది. 2010లో కర్మాగారం నిర్మాణం పూర్తయింది. 2012 జూలైలో ఉత్పత్తి ప్రారంభించింది. ఈ కర్మాగారంలో 350 మంది శాశ్వత ఉద్యోగులు, సుమారు 900 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. కర్మాగారం ప్రారంభం నుంచి చిన్నచిన్న ఒడిదుడుకులు వచ్చినా ఎప్పుడూ లేఆఫ్ పరిస్థితి రాలేదు. తెలుగుదేశం హయాంలో విద్యుత్ యూనిట్ ధర రూ.4.25 ఉండగా, గత వైసీపీ ప్రభుత్వం దానిని రూ.6.05కి పెంచింది. అయినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్‌లో ఫెర్రో ఉత్పత్తులకు డిమాండ్ ఉండడంతో అలాగే నెట్టుకొచ్చింది. కానీ గత నాలుగు నెలల నుంచి అంతర్జాతీయ మార్కెట్‌లో ఫెర్రో ఉత్పత్తులకు డిమాండ్ తగ్గింది. అభిజిత్ కర్మాగారంలో రోజుకు 800 టన్నులు ఉత్పత్తి అవుతుంది. ఇక్కడ టన్ను ఉత్పత్తికి రూ.84 వేలు అవుతుండగా, గతంలో అంతర్జాతీయ మార్కెట్లో రూ.1.1 లక్షల నుంచి రూ.1.25 లక్షల ధర లభించేది. ప్రస్తుతం అది రూ.72 వేలకు పడిపోయింది. దీంతో కర్మాగారం గడ్డు పరిస్థితుల్లో చిక్కుకుంది. టన్నుకు రూ.12 వేలు నష్టపోవలసి వస్తోంది. దీనికి తోడు విద్యుత్ బకాయిలు రూ.180 కోట్లకు చేరుకున్నాయి. అయితే ప్రభుత్వం నుంచి యూనిట్‌కు సుమారు రూ.9.5 చొప్పున సర్‌చార్జీ కర్మాగారానికి రావలసి ఉంది. కానీ గత ప్రభుత్వం దీనిని కర్మాగారానికి విడుదల చేయలేదు. ప్రభుత్వం నుంచి ప్రస్తుతం సర్‌చార్జీల కింద సుమారు రూ.150 కోట్లు రావాల్సి ఉందని తెలిసింది. పూర్తి విద్యుత్ బకాయిలు చెల్లిస్తే తప్ప సర్‌చార్జీలు విడుదల చేయలేమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఒకపక్క విద్యుత్ బకాయిలు పేరుకుపోవడం, మరోపక్క అంతర్జాతీయ మార్కెట్లో ధర తగ్గడంతో లేఆఫ్ ప్రకటించక తప్పలేదని యాజమాన్యం చెబుతోంది. రెండు నెలల్లో అన్నీ సర్దుకుంటాయని, అప్పుడు కర్మాగారాన్ని పునఃప్రారంభిస్తామని అంటోంది. అప్పటివరకూ 15 రోజుల జీతం ఇస్తామంటోంది. అందుకు ఉద్యోగులు, కార్మికులు అంగీకరించడం లేదు. తమకు ఈ రెండు నెలలు 26 రోజులకు వేతనం చెల్లించాలని, అనంతరం కర్మాగారాన్ని పునఃప్రారంభిస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు నాలుగు రోజులుగా కర్మాగారం ఎదుట ఆందోళన చేస్తున్నారు. కార్మికులకు ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి.



విశాఖలోని గ్రంథాలయాన్ని సమయానికి తెరవకపోవడంపై ప్రశ్నిస్తున్న మంత్రి నారా లోకేశ్

రెండో రోజూ ప్రజాదర్బార్

వినతులు స్వీకరించిన మంత్రి నారా లోకేశ్

- తమను క్రమబద్ధీకరించాలని కోరిన 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు
- వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేయాలని కోరిన నాయీ బ్రాహ్మణులు
- అనంతరం అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

విశాఖపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ శనివారం కూడా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన తమ కుమారుడిని ... మిగతా 8వ పేజీలో

ఆత్మరక్షణకు కర్రసాము

శిక్షణపై బాలికలు, యువతుల్లో పెరుగుతున్న ఆసక్తి

ఆదివారం ప్రత్యేకం

- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు
- ఆత్మరక్షణతోపాటు ఆత్మవిశ్వాసం పెరగడానికి దోహదం
- బరువు తగ్గడంతోపాటు కీళ్లు, ఎముకల పటుత్వం, ఏకాగ్రత మెరుగుపడేందుకు అవకాశం
- విశాఖలో పెరుగుతున్న కేంద్రాలు


వీఎంఆర్‌డీ పార్కులో కర్రసాము సాధన చేస్తున్న బాలికలు, యువతులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) **కర్రసాము పట్ల ప్రస్తుతం బాలికలు, యువతుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఆత్మరక్షణతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు దోహదపడుతుందని తల్లిదండ్రులు కూడా అందుకు ప్రోత్సహిస్తున్నారు. కొందరైతే కర్రసాములో నైపుణ్యం పెంచుకోవడం ద్వారా రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలో పాల్గొని పతకాలను కొల్లగొడుతున్నారు.**

కర్రసాముకు పురాతన చరిత్ర ఉంది. భారత దేశంలో క్రీస్తుపూర్వం నుంచి కర్రసాము ఉనికి ఉంది. అప్పటి ప్రజలు ప్రత్యర్థుల దాడులను తిప్పికొట్టేందుకు, జంతువుల దాడి నుంచి రక్షణకు కర్రసాము నేర్చుకునేవారు. కర్రసాముతో బరువు తగ్గడంతోపాటు కీళ్ల, ఎముకల పటుత్వం, ఏకాగ్రత పెరుగుతాయి. అలాగే రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. అనుకోని అపాయం ఎదురైతే సమర్థంగా ఎదుర్కొనగలమనే ఆత్మవిశ్వాసం కూడా కలుగుతుంది. అందుకే కొన్ని దశాబ్దాల కిందటి వరకూ కర్రసాముకు విశేషమైన ప్రాచుర్యం, ఆదరణ ఉండేవి. గ్రామాలు, పట్టణాల్లో కర్రసాము పోటీలు జరుగుతుండేవి. జాతరలు, పండుగలు జరిగితే కర్ర సాము ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. కాలక్రమేణా కర్రసాము మరుగున ... మిగతా 8వ పేజీలో


కత్తితోదాడిచేస్తున్న యువకుడిని కొట్టి కిందపడేస్తున్న యువతి

ఆత్మరక్షణకు ఎంతో అవసరం



నేను మూడేళ్ల కిందట వ్యాయామంలో భాగంగా వాకింగ్ కోసం సెంట్రల్ పార్కుకి వచ్చాను. అప్పుడు కర్రసాములో శిక్షణ ఇస్తుండడం చూసి ఆసక్తితో నేర్చుకోవడం ప్రారంభించాను. బాలికలు, యువతులతోపాటు మహిళలపై దాడులు పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో ఆత్మరక్షణకు కర్రసాము నేర్చుకోవడం చాలా అవసరం. భవిష్యత్తులో నేను ఆడపిల్లలకు కర్రసాములో శిక్షణ ఇస్తాను. - పి.సంధ్య, ఎంబీఏ విద్యార్థిని

కర్రసాముతో శరీర దృఢత్వం పెరిగింది!



దాడులను అడ్డుకోవడానికి జరిగిన చర్చలో కర్రసాము ప్రస్తావన వచ్చింది. దీంతో ఎక్కడ శిక్షణ ఎక్కడ ఇస్తున్నారో స్నేహితుల ద్వారా తెలుసుకుని ఐదు నెలల కిందట ఇక్కడ చేరాను. కర్రసాము వల్ల ఎముకలు, కీళ్ల పటుత్వం పెరుగుతుంది. రక్తప్రసరణ సవ్యంగా జరగడంతో ఉత్సాహంగా ఉంటున్నాను.

- ఎస్.మానస, ఇంజనీరింగ్ విద్యార్థిని

జల్ జీవన్ పనులకు గ్రహణం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి) **గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ పథకం పనులు అటకెక్కాయి. గత వైసీపీ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వ హయాంలో ఈ పనులు పూర్తవుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.**


గొలగాం గ్రామంలో ఇంటింటి కొళాయిల ఏర్పాటు కోసం వేసిన పైపులు

కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించని గత వైసీపీ ప్రభుత్వం

- కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినా చెల్లింపుల్లో జాప్యం
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు
- దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం


అనకాపల్లి మండలం కోడూరులో మధ్యలో ఆగిన జల్ జీవన్ పనుల కోసం చేపట్టిన పనులు

జల్ జీవన్ మిషన్ పథకాన్ని 2011లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉండగా ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చాక గ్రామీణ నీటి సరఫరాల శాఖ ఇంజనీర్ల ద్వారా అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రతి గ్రామానికి రూ.20 లక్షలు నుంచి రూ.40 లక్షలు వరకు మంజూరు చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో ఈ పథకం అమలు విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేసింది. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైనా కాంట్రాక్టర్లు చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకుండా తాత్సారం చేసింది. దీంతో కాంట్రాక్టర్లు తదుపరి పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపలేదు. దీని వల్ల జల్ జీవన్ మిషన్ పథకం కింద చేపట్టిన పనులు నత్తనడకన సాగాయి. జిల్లాలో. 4.17 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకొని ఇప్పటి వరకు 2.63 లక్షల ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చినట్టు చెబుతున్నారు. ఇంకా 1.54 లక్షల ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని అధికారుల రికార్డులు పేర్కొంటున్నాయి.

ఎన్నికల ముందు నిలిచిన పనులు

సార్వత్రిక ఎన్నికల ముందు జల్ జీవన్ మిషన్ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో జల్ జీవన్ మిషన్ కింద మొత్తం రూ.72 కోట్ల అంచనా వ్యయంతో దశలు వారీగా 2,163 నిర్మాణ పనులు చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. వీటిలో 1,737 నిర్మాణ పనులు ప్రారంభించారు. 959 నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 105 పనులు ఇంకా ... మిగతా 8వ పేజీలో

ఘనంగా గైరమ్మ ఊరేగింపు


సత్యవరంలో వరి దుబ్బులతో భక్తులు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం గ్రామంలో శనివారం దుబ్బు గైరమ్మను ఘనంగా ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. అట్లతద్ది పురస్కరించుకుని మహిళలు గౌరీ వ్రతం చేస్తారు. ఈ సందర్భంగా వరి దుబ్బును గైరమ్మగా కొలుస్తూ ఆలయానికి తీసుకువచ్చి పూజలు చేయడం ఆనవాయితీ. అనంతరం కార్తీక పౌర్ణమి వరకు ఆలయంలో దుబ్బు గైరమ్మకు భక్తులు పూజలు నిర్వహిస్తారు. కార్తీక పౌర్ణమివరకు నిత్య పూజలు కొనసాగిస్తారు. ఈ ఊరేగింపులో పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువకులు చేసిన కర్రసాము అలరించింది.

భూ సర్వేలో లోపాలను సరిచేసుకోవాలి

కోటవురట్ల, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు గతంలో నిర్వహించిన భూ రీసర్వేలో లోపాలు ఉంటే వాటిని సరి చేసుకోవాలని తహసీల్దార్ తిరుమలబాబు సూచించారు. శనివారం మండల పరిధి పీరామన్నపాలెంలో రెవెన్యూసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో భూ రీసర్వే లో భూమి విస్తీర్ణంలో తప్పులు, హెచ్చుతగ్గులు, భూయాజమానిపేరు మార్పులుంటే దరఖాస్తుచేసుకోవాలన్నారు. ఈసమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, సర్వేయర్ శ్రీనివాసరావు, సర్పంచ్ వెంకటరమణ, వీఆర్‌వో అనూష్ పాల్గొన్నారు.

పెనుగల్లు పీహెచ్‌సీ వైద్యాధికారిపై సస్పెన్షన్ తగదు

విచారణ కమిటీ ఎదుట స్పష్టంచేసిన పలు గ్రామాల ప్రజలు


విచారణకమిటీ సభ్యులను ప్రశ్నిస్తున్న ఉప సర్పంచ్ మాణిక్యం తదితరులు

ఎస్. రాయవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రామ్‌నాయక్‌పై వైద్య సిబ్బందినుంచి వచ్చిన పలు ఫిర్యాదులతో ఆయనను సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో శనివారం అడిషనల్ డీఎంహెచ్‌వో జ్యోతి ఆధ్వర్యంలో కమిటీ బృందం ఈ పీహెచ్‌సీకి వచ్చి వైద్య సిబ్బందిని విచారణ చేశారు. ఈసందర్భంగా ధర్మవరం అగ్రహారం ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యంతోపాటు పలు గ్రామాల ప్రజలు డాక్టర్ రామ్‌నాయక్‌ను ఎవరికీ తెలియకుండా సస్పెండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారన్నారు. అధిక సంఖ్యలో జనాలు రావడంతో వైద్యశాఖ అధికారుల సమాచారం మేరకు స్థానిక ఎస్‌ఐ విభీషణరావు ఘటనా స్థలానికి వచ్చారు. వారికి సర్ది చెప్పి, ఏదైనా చెప్పాలంటే వినతిపత్రాలందించాలని కోరారు. వైద్య సిబ్బందిని కమిటీ విచారించింది. స్థానికులు డాక్టర్ రామ్‌నాయక్‌కు అనుకూలంగా కమిటీకి వివరించారు. ఈ నివేదికను ఉన్నతాధికారుకులకు అందించడం జరుగుతుందని అడిషనల్ డీఎంహెచ్‌వో జ్యోతి తెలిపారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

పాయకరావుపేట రూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపట్నం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో ఎ. జయప్రకాశరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సిహెచ్. చంద్రశేఖరరావు, కార్యదర్శి వై.వి. సత్యనారాయణ, పీఆర్‌ఏఈ కచేరి పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- హోం మంత్రి వంగలపూడి అనిత
- టీడీపీలోకి పెదబోదిగల్లం సర్పంచ్



హోం మంత్రి అనిత సమక్షంలో టీడీపీలో చేరిన సర్పంచ్ మున్నీషాబేగం, అనుచరులు

ఎస్. రాయవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి లేక, గ్రామాలో సర్పంచ్‌లంతా కూటమి ప్రభుత్వం కోసం ఎదురు చూశారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని పెట్టుగోళ్లపల్లిలో శనివారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్‌డీఏ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లతో సమానమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రూ 450 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్టు చెప్పారు. బోరుగడ్డ అనిల్ అరెస్ట్‌పై హోం మంత్రి స్పందిస్తూ, గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లుగా దళితులపై విపరీతంగా దాడులు జరిగాయని, మాస్కులు అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను దారుణంగా హింసించి, ఆయన మరణానికి కారణమయ్యారన్నారు. అనిత రూ. 8 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు శంకుస్థాపన చేశారు. ఉద్యానవనాల పెంపకంలో భాగంగా కొబ్బరి మొక్కను నాటారు. అనంతరం పొలం బడిలో జీవామృతం తయారీ డెమో పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు వెంకటప్రశాంతి, జనసేన నేత గెడ్డం బుజ్జి, ఎస్. రాయవరం, అధ్యక్షుడు అమలకంటి అబద్దం, మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకటరాజు, ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి పాల్గొన్నారు.

మైనారిటీల అభివృద్దే లక్ష్యం

నక్కపల్లి,: గత వైసీపీ పాలనలో గ్రామాలభివృద్ధికి ఎంపీలు,ఎమ్మెల్యేలు చుట్టూ ప్రజాప్రతినిధులు ప్రదక్షిణ చేసేవారని, కూటమి ప్రభుత్వంలో నేరుగా గ్రామాలకే నిధులు విడుదలవుతున్నట్టు హోం మంత్రి అనిత తెలిపారు. మండలంలో పెదబోదిగల్లం ముస్లిం గ్రామ సర్పంచ్ మున్నీషా బేగం సహా ఆమె అనుచరులు శనివారం టీడీపీలోకి చేరారు. గత కొంతకాలం నుంచి ఆమె వైసీపీలో ఉంటున్నారు. ఎంపీ గొల్ల బాబూరావు అనుచరులుగా గుర్తింపు పొందారు. శనివారం హోం మంత్రిఅనిత ఈ గ్రామంలో పర్యటించారు. ముస్లిం సోదరుల పండుగ గ్యార్మీ షరీఫ్ ఉరుసు సందర్భంగా గ్రామస్థులకు శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ షేక్ మున్నీషాకు, మరికొందరు గ్రామస్తులకు ఆమె పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెదబోదిగల్లం అభివృద్ధి కోసం రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.

పాయకరావుపేట రూరల్: గ్రామాల అభివృద్ధే పల్లె పండుగ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. మండలంలోని సత్యవరం, మాసాహెబ్‌పేట, గోపాలపట్నంలల్లో శనివారం నిర్వహించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో ఎ. జయప్రకాశరావు, ఎం పీటీసీ సభ్యుడు కె. సతీష్ రాజు, టీడీపీ నేతలు కంకిపాటి వెంకటేశ్వరరావు, ఈఓపిఆర్డీ చంద్రశేఖరరావు, పీఆర్‌ఏఈ కచేరి, ఏపీవో హేమలత, కార్యదర్శులు సత్యనారాయణ, మురళి పాల్గొన్నారు.

కోటవురట్ల: పల్లెల్లో అభివృద్ధి లక్ష్యంగా కూటమిప్రభుత్వం సాధ్యపడుతుందని ఎ టీడీపీ మండల అధ్యక్షుడు జానకీశ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలో కొడవటిపూడిలో పలు అభివృద్ధిపనులను శంకుస్థాపనచేశారు.ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు పెట్లలింగం నాయుడు, వేచలపు జనార్దన్, భాస్కరరావు, ఎంపీడీవో కాశీవిశ్వనాథం, మండల ఇంజనీర్ వర్మ, ఉపాధి ఏపీవో నాగరాజు, కొడవటిపూడి సర్పంచ్ అప్పారావు ఎంపీటీసీ ప్రకాష్, నాయకులు తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.


భారీ వాహనాలతో ధ్వంసమైన కాగిత రహదారి



ఆ గ్రామ రోడ్డుపై బోల్తాపడిన రాళ్ల లోడు లారీ


అదే మార్గంలో కూరుకుపోయిన లారీ

ఛిద్రమవుతున్న కాగిత-అమలాపురం రహదారి

- టోల్ ఫీజు తప్పించుకునేందుకు దొడ్డిదారిన భారీ వాహనాలు
- శిథిలమవుతున్న గ్రామీణ రహదారులు
- కాగిత సమీపాన రాళ్లలోడు లారీ బోల్తా

నక్కపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలం వేంపాడు హైవే టోల్‌ప్లాజా నుంచి టోల్ ఫీజు చెల్లింపును తప్పించుకోవాలన్న ఉద్దేశంతో పలు వాహన చోదకులు దొడ్డిదారిన రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో కాగిత రోడ్డుపై శుక్రవారం అర్ధరాత్రి సమయంలో భారీ రాళ్ల లోడుతో వెళ్తున్న లారీ కాగిత గ్రామ రోడ్డుపై బోల్తాపడింది. మరోలారీ రోడ్డుకు అడ్డంగా ఓ కల్వర్టు వద్ద కూరుకుపోయింది. దీంతో ఈ గ్రామాల మధ్య ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. కాగిత , అమలాపురం, పాటిమీద, వేంపాడు గ్రామాల్లో రహదారులు ఈ భారీ వాహనాల రాకపోకలు వల్ల ధ్వంసమవుతున్నాయి. పాఠశాలలకు సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు కూడా తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు.

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, వేంపాడు టోల్‌ప్లాజా యాజమాన్యం గ్రామీణ ప్రాంత రహదారులపై నుంచి ఈ వాహనాలు రాకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

48 మందికి వైద్య పరీక్షలు


వేమగిరిలో కేన్సర్ అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఎస్. రాయవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలోని వేమగిరి గ్రామంలో వరల్డ్ బ్రెస్ట్ కేన్సర్ అవేర్నెస్ డే సందర్భంగా శనివారం హోమీ బాబా కేన్సర్ హాస్పిటల్, పరిశోధన కేంద్రం డాక్టర్ల బృందం ఆధ్వర్యంలో 48 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు నమిత, శైలజ, ఎస్‌ఎస్‌వి శక్తిప్రియ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులతో పాటు గుట్కా, పాన్ మసాలాకు దూరంగా ఉండటంతో నోటి కేన్సర్ రాకుండా ఉటుందన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పీఎస్‌వీఎస్ ప్రసాద్, వై సూర్యకుమారి, వీణా వాహిణి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు నిష్పక్షపాతంగా జరపాలి

కోటవురట్ల, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఆడిట్ సిబ్బంది తనిఖీలు నిష్పక్షపాతం నిర్వహించాలని ఎంపీడీవో కాశీ విశ్వనాథం ఆదేశించారు. శనివారం మండలపరిషత్ సమావేశమందిరంలో ఆడిట్‌సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-2024 ఆర్థిక సంవత్సరంలో రూ.22.85 కోట్లతో 1,467 జరిగినట్టు చెప్పారు. సిబ్బందికి రూ. 16 కోట్లు, అభివృద్ధి పనుల్లో రూ. 17.48కోట్ల వేతనాలు రూపంలో, 4.60కోట్ల మెటీరియల్ రూపం నిధులు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఎస్‌ఆర్‌పీలు రాజేంద్ర, నాగరాజు, ఏపీవో నాగరాజు, డీఆర్‌పీలు, వీఆర్‌పీలు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు


పందూరు సచివాలయంలో ఉద్యోగులను సన్మానిస్తున్న సర్పంచ్

కోటవురట్ల, అక్టోబర్ 19, (ఆంధ్రజ్యోతి): పందూరు సచివాలయం నుంచి బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న జ్యోష్నా బదిలీపై హుకుంపేట మండలానికి బదిలీఅయ్యారు. వీఆర్‌వోగా పనిచేస్తున్న ఆశా రోలుగుంట మండలానికి, సచివాలయం అసిస్టెంట్ ఇంజనీర్ మునగపాక బదిలీ అయింది. ఈ నేపథ్యంలో సర్పంచ్ చికెట్ల జగదీశ్ ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. వారి సేవలను కొనియాడారు. వైసీపీ నాయకుడు చికెట్ల వెంకట్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి: ఎంపీడీవో

పాయకరావుపేట, అక్టోబరు 19 : గ్రామాల్లో ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు శాత శాతం పూర్తయ్యేలా కృషిచేయాలని ఎంపీడీఓ జయప్రకాశరావు ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఓ పీఆర్డీ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వర్మ, పీఆర్ జేఈ కచేరి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు వైవి.సత్యనారాయణ పాల్గొన్నారు.

'బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు'


మార్టూరు సదస్సులో మాట్లాడుతున్న సీఐ తేజ వెంకట కుమార్

అచ్యుతాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో బెల్టు షాపులు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ స్పష్టం చేశారు. 'మద్యం వ్యాపారులు సిండికేట్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనంపై స్పందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్టూరులో ఎవరు బెల్టు షాపుల గురించి వేలం వేశారు., ఎవరు రూ.5.25 లక్షలకు పాట దక్కించుకున్నారు.. అన్న అంశాలపై ఎక్సైజ్ సీఐతో పాటు సీఐతో విచారణ జరుపుతున్నామన్నారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసిన షాపులను రద్దు చేయిస్తానని ఆయన హెచ్చరించారు.

మార్టూరులో అవగాహన సదస్సు

అనధికారికంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎలమంచిలి ఎక్సైజ్ సీఐ వి.తేజ వెంకటకుమార్ హెచ్చరించారు. అచ్యుతాపురం మండలంలోని మార్టూరులో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మద్యంతో పాటు గంజాయి వంటి మాదకద్రవ్యాల లావాదేవీలు జరిపితే ఊరుకునేది లేదన్నారు. ప్రధానంగా యువత ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు నడపడం చట్టరీత్యా నేరంగా పేర్కొన్నారు. పాటలు పెట్టి అనధికారికంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకు ముందు మార్టూరులో మద్యం విక్రయిస్తున్న గుర్రాల రాజును అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఎక్కడ మద్యం అక్రమ విక్రయాలు జరిగినా తమకు సమాచారం అందిచాలని కోరారు.

'అభిజిత్' ఎదుట కార్మికులు వంటా- వార్పు


వంటా- వార్పు కార్యక్రమం ద్వారా నిరసన తెలుపుతున్న కార్మికులు

అచ్యుతాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సెజ్‌లో మూతపడిన అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారాన్ని వెంటనే తెరిపించి, తమకు న్యాయం చేయాలని కార్మికులు కోరారు. ఈ మేరకు శనివారం సంస్థ గేటు వద్ద వంటా- వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ తమ సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలన్నారు. న్యాయం చేయకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రొంగలి రాము, కె.సోమునాయుడు, చిప్పాడ సర్పంచ్ రాజాన నాయుడు బాబు, రెడ్డి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో నియోజకవర్గం అభివృద్ధి

- అచ్యుతాపురంపై మరింత ప్రత్యేక దృష్టి
- సెజ్‌లో కొత్త పరిశ్రముల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ఉత్సాహం
- అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్


అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, అక్టోబరు 19 : నియోజకవర్గ అభివృద్ధికి అధికారులంతా మరింత సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సూచించారు. స్థానిక ఏపీఐఐసీ కార్యాలయంలో శనివారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందు తున్న అచ్యుతాపురంపై అంతా ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అచ్యుతాపురం సెజ్‌లో ఒక్క కొత్త కర్మాగారం రాకపోగా, ఉన్నవి పోయాయని ఎద్దేవా చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కొత్తగా కర్మాగారాలు ఏర్పాటుచేయడానికి పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారు. అందువల్ల వారికి అవసరమై మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అచ్యుతాపురం జంక్షన్‌ను ముందుగా విస్తరించి సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఇక్కడ ట్రాఫిక్‌కు ఎటువంటి అవాంతరాలు లేకుండా చూడాలన్నారు. అలాగే అచ్యుతాపురం- గాజువాక ప్రధాన రహదారిలో గల అప్పన్నపాలెం నుంచి పూడిమడక రోడ్డులో గల సెజ్ ముఖద్వారం వరకు వందడుగుల వెడల్పు రోడ్డు పనులు త్వరిత గతిన ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషా, ఏపీఐఐసీ జెడ్.ఎం.హరిప్రసాదరావు, తహసీల్దార్ జనార్ధన్, ఎంపీడీవో కె.ప్రభాకరరావు, డీఎస్పీ సత్యనారాయణ, సీఐ నమ్మి గణేష్, ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి సెక్షన్ ఎస్ఈ డి.ప్రసాద్, డీఈఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

- మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి
- రామ్‌నగర్ టిడ్కో కాలనీలో పారిశుధ్య కార్యక్రమం


ఎలమంచిలి మండలం రామ్‌నగర్ టిడ్కో కాలనీ.., రాంబిల్లి మండలం వెల్చూరులో తుప్పల తొలగింపు

ఎలమంచిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధి రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయం వద్ద శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ ప్రసాద్‌రాజు తదితర అధికారులంతా కాలనీ వాసులతో కలిసి పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ కాలనీవాసులంతా సమష్టిగా ఉండా పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, టిడ్కో గృహ సముదాయం అధ్యక్ష, కార్యదర్శులు పసాద్, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు అన్నారు. మండలంలోని వెల్చూరు గ్రామంలో శనివారం తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధవిలతో కలిసి స్వచ్ఛతీ హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, గ్రామస్థులతో కలిసి పిచ్చి మొక్కలను, చెత్తా చెదారాన్ని తొలగించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను అధికారులు వివరించారు.ఈవోపీఆర్‌డీ రాజు, మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత, వెలుగు ఏపీఎం పద్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు..

'పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం'

రాంబిల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పల్లెల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. పల్లె పండుగలో భాగంగా అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఆయన శనివారం మండలంలోని వెల్చూరు, రాజకోడూరు, మర్రిపాలెం, మురకాడ, దిమిలి, మామిడివాడ, కొత్తూరు, పంచదార్ల గ్రామాల్లో పర్యటించారు. సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాని శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధవి, వైస్ ఎంపీపీ కోటాపు లక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డి.రంగనాయకులు, టీడీపీ, జనసేన మండల శాఖల అధ్యక్షులు వి.దినబాబు, పప్పల నూకన్నదొర, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారాలు మోపొద్దు

రాంబిల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపై విద్యుత్ భారాలు మోపవద్దంటూ రాంబిల్లి జంక్షన్‌లో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్టీ మండల కన్వీనర్ జి.దేముడు నాయుడు, రామకృష్ణ, కాశియ్య, రాము, లక్ష్మి, గంగరాజు, నూకరాజు తదితరులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు బాలాశ్రీ ఎంపిక



అచ్యుతాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలకు చెందిన జి.బాలాశ్రీ ఉమ్మడి విశాఖ జిల్లా తరఫున రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైందని హరిపాలెం ఉన్నత పాఠశాల పీడీ దర్మిరెడ్డి రాజు తెలిపారు. పదవ తరగతి చదువుతున్న బాలాశ్రీ సబ్బవరం మండలం పెద గుమ్ములూరులో జరిగిన జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2024-25 ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరచడంతో ఆమె రాష్ట్ర స్థాయికి ఎంపికైందని ఆయన తెలిపారు.

మునగపాకను కరువు మండలంగా ప్రకటించాలి

- మంత్రి లోకేశ్‌ను కోరిన ఎమ్మెల్యే


లోకేశ్‌కు సమస్యల వివరిస్తున్న సుందరపు

మునగపాక, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ ఆధారిత మండలమైన మునగపాకను కరువు మండలంగా ప్రకటించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. ఈ మేరకు శనివారం విశాఖలోని మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట కాలువల ద్వారా నీరు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే ఇరిగేషన్ శాఖ ద్వారా పంట కాలువలను తవ్వించి రైతులకు నీరందించే ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నల్లబెల్లంపై నిషేధాన్ని ఎత్తివేయాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'తగ్గించిన పాల సేకరణ ధరను వెంటనే పునరుద్ధరించాలి'

అచ్యుతాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ తగ్గించిన పాలసేకరణ ధరను వెంటనే పునరుద్ధరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు విశాఖ డెయిరీ ఎండీకి శనివారం ఆయన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో వ్యవసాయం తర్వాత పాడి ప్రధాన జీవనాధారంగా పేర్కొన్నారు. వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో ఎక్కువ మంది రైతులు పాడిపైనే ఆధారపడుతున్నారన్నారు.

డిగ్రీ అధ్యాపకునికి పురస్కారం


రామారావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఎలమంచిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకులు రేఖ రామారావుకు జమ్మూ విశ్వవిద్యాలయం అందించే ప్రతిష్ఠాత్మక సావిత్రిబాయి పూలే అంతర్ రాష్ట్రీయ శిక్షక్ శిరోమణి అచీవర్స్ అవార్డు లభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతకు శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు.

ఈవీఎంల గోడౌన్ తనిఖీ

» కలెక్టర్‌తో కలిసి క్షుణ్ణంగా పరిశీలించిన నోడల్ ఆఫీసర్

» బయట అగ్నిమాపక పరికరాల ఏర్పాటుకు సూచన



గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి విశ్వేశ్వరరావు, చిత్రంలో జిల్లా కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 19 : జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎంల గోడౌన్‌ను డిప్యూటీ చీఫ్ ఎన్నికల ఆఫీసర్, రాష్ట్ర ఈవీఎం నోడల్ అధికారి కె.విశ్వేశ్వరరావు శనివారం తనిఖీ చేశారు. కలెక్టర్ విజయ కృష్ణన్‌తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను తనిఖీ చేశారు. గోడౌన్ సీల్‌ను, సీసీ కెమెరాలను, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలను గోడౌన్ బయట కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో దయానిధి, ఆర్డీవో షేక్ ఆయీషా, జిల్లా అగ్నిమాపక అధికారి వెంకటరమణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనకాపల్లి ప్రశాంతమైన జిల్లా

» విడిచి వెళ్లడం బాధగా ఉంది » వీడ్కోలు సభలో ఎస్పీ దీపికా



ఎస్పీని సత్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ గణేష్, పోలీస్ అధికారులు

అనకాపల్లి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి ప్రశాంతమైన జిల్లా అని ఎస్పీ దీపికా అన్నారు. ఈ జిల్లాను విడిచి వెళ్లడం బాధగా ఉందని పేర్కొన్నారు. బదిలీపై వెళుతున్న ఆమెకు పట్టణంలోని పెంటకోట కన్వెన్షన్ హాల్‌లో శనివారం రాత్రి ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న అధికారులతో పాటు సబ్ డివిజనల్ అధికారులు, జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు హాజరై పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ఎస్పీగా తక్కువ రోజులు పనిచేసినప్పటికీ సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు వైద్యాలయంలో సీటీ స్కాన్ సేవలు



అనకాపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్యాలయంలో ఎట్టకేలకు సీటీస్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఉన్న సిటీస్కాన్ మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉండడంతో అదానీ కంపెనీ సీఎస్ఆర్ నిధుల ద్వారా అధునాతనమైన సీటీస్కాన్‌ను వైద్యాలయానికి గతేడాది డిసెంబరులో అందజేసింది. టెక్నీషియన్లు లేక పోవడంతో అప్పటి నుంచి వినియోగంలోకి రాలేదు. ప్రభుత్వం ఇద్దరు టెక్నీషియన్లు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించడంతో కదలిక వచ్చింది. శుక్రవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కూడా సీటీస్కాన్‌ను పరిశీలించి శనివారం నుంచి రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని వైద్యాధికారులకు సూచించారు. ఇందులో భాగంగా శనివారం ముగ్గురు రోగులకు సిటీస్కాన్ నిర్వహించినట్టు సిబ్బంది తెలిపారు.

ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ చెస్ జట్ల ఎంపిక



జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో చెస్ పోటీల్లో పాల్గొన్న బాలురు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శనివారం ఉమ్మడి విశాఖ జిల్లా అండర్-14, అండర్-17 బాలబాలికలకు చెస్ పోటీల ఎంపిక కార్యక్రమం జరిగింది. సుమారు 350 మంది బాలబాలికలు ఈ ఎంపిక పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీల నుంచి ఉమ్మడి విశాఖజిల్లా బాలబాలికల చెస్ జట్ల ఎంపిక జరుగుతుందని స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యదర్శి మోటూరి వెంకట నాగేశ్వరరావు, దేముడుబాబు తెలిపారు.

విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని ఆందోళన

సబ్బవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల వద్ద నుంచి వసూలు చేస్తున్న ట్రూ అప్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.ప్రభావతి డిమాండ్ చేశారు. శనివారం ఇక్కడి ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట సిబ్బందితో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయం అని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకుల పాలన వైసీపీ పాలనను తలపిస్తుందన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరకుల ధరలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ట్రూ అప్ చార్జీల వసూలుతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తలలు పట్టుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సింది కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు ఎర్రా సోంబాబు, గౌరీసు, ఉప్పాడ సత్యవతి, పప్పుల కోటి, భారతి తదితరులు పాల్గొన్నారు.

సమాచార బోర్డుపై అధికారుల పేర్లు మార్పు



కొత్తవారి పేరు చేర్చుతున్న ఉద్యోగిని

పరవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. కార్యాలయంలోని సమాచార బోర్డుపై బదిలీ అయిన అధికారుల పేర్లు స్థానంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వారి పేర్లను చేర్చారు. 'సమాచార

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బోర్డు నిర్వహణలో నిర్లక్ష్యం' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించడంతో వెంటనే స్పందించారు. ఈ మేరకు శనివారం సమాచార బోర్డుపై ఉన్న పాత అధికారుల పేర్లను తొలగించి ఇటీవల బాధ్యతలు చేపట్టిన వారి పేర్లను చేర్చారు. అలాగే సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లు కూడా పేర్లకు ఎదురుగా పేర్కొన్నారు.. భవిష్యత్తులో పొరపాట్లు జరగకుండా చూస్తామని మండల పరిషత్ కార్యాలయ ఏవో జీవీ రాంబాబు తెలిపారు.

కూటమి పాలనలో పల్లెలకు పండుగే

» పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తాం » పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యేలు కొణతాల, పంచకర్ల



కశింకోట : అచ్చెర్లలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల శంకుస్థాపనలో ఎమ్మెల్యే కొణతాల తదితరులు

కొత్తూరు, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. అనకాపల్లి మండలంలోని కూండ్రం, సుందరయ్యపేట, వెంకుపాలెం, జగన్నాథపురం, రొంగలివానిపాలెం గ్రామాల్లో శనివారం నిర్వహించిన పల్లె పండుగలో మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి చేపడుతున్నామన్నారు. అంతకుముందు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కూండ్రం సర్పంచ్ నందారపు లక్ష్మి, ఎంపీటీసీ జెట్టి సత్యవతి, జగన్నాథపురం సర్పంచ్ ముప్వల రాము, కూటమి నేతలు నందారపు సూరిబాబు, పచ్చికూర రాము, మరిడినాయుడు, చదరం నాగేశ్వరరావు, భరత్‌బాబు, ఈశ్వర్, డీఈ వేణుగోపాల్, ఏఈ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : పల్లె పండుగతో గ్రామీణ ప్రాంతాలన్నీ అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. అచ్చెర్ల, మోసయ్యపేట, సింగారం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి డ్రైనేజీలు, రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాయకులు కాయల మురళీ, గొంతిన శ్రీనివాసరావు, నిమ్మదల సన్యాసినాయుడు, దొడ్డి నాగేశ్వరరావు, నైనంశెట్టి రమణారావు, పొన్నగంటి అప్పారావు, కర్రి వెంకటసత్యనారాయణ, జాను, కొర్ని రాము, సర్వసిద్ధి నాగేశ్వరరావు, ద్వారపురెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.



పరవాడ : ధర్మారాయుడుపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనలో పంచకర్ల తదితరులు

పరవాడ : గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం, వాడచీపురుపల్లి, రావాడ, కలపాక, ఈ.బోనంగిల్లో నిర్వహించిన పల్లె పండుగలో మాట్లాడారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఉపాధి నిధులు ఖర్చు చేస్తుందన్నారు. అంతకు ముందు సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్, మాజీ ఎంపీపీలు మాసవరపు అప్పలనాయుడు, పైలా జగన్నాథరావు, మాదంశెట్టి నీలబాబు, పీఆర్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాలు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, సర్పంచ్‌లు చింతకాయల సుజాత, చేపల మసేను, శివలంక లక్ష్మి, బొండా కనకారావు, మోటూరు సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాసకాసులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభల్లో అర్జీలకు ఇరవై రోజుల్లో పరిష్కారం



సబ్బవరం : అసకపల్లిలో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం : రెవెన్యూ గ్రామ సభల్లో రైతుల వద్ద నుంచి వస్తున్న అర్జీలకు ఈ సభలు పూర్తయిన అనంతరం ఇరవై రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. అసకపల్లిలో శనివారం జరిగిన రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడారు. సర్పంచ్ కర్రి నర్సింగరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, రీ సర్వే డీటీ వై.గణేష్, సర్వేయర్లు ఎల్.అప్పారావు, రాంబాబు, శ్రీనివాసరావు, రవితేజ, వీఆర్వోలు డి.ఈశ్వరరావు, కామరాజు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : భూముల రీసర్వేలో తప్పిదాల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తుందని తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్ తెలిపారు. మండలంలోని కలపాకలో శనివారం నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. రీసర్వేలో భూమి విస్తీర్ణం, ఫోటో మిస్‌మ్యాచ్ వంటి సమస్యలుంటే గ్రామసభ దృష్టికి తీసుకు వస్తే పదిహేను రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. సుమారు ముప్పై మంది భూ సమస్యలపై అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ కొఠారి సురేష్ నాయుడు, ఆర్ఐ సురేష్, సర్పంచ్ బొండా కనకారావు, వీఆర్వోలు భుజంగరావు, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం వేటజంగాలపాలెంలో శనివారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రధానంగా రీ సర్వే జరిగిన భూములకు సంబంధించి ఎటువంటి మార్పులు, చేర్పులు ఉన్నా గ్రామ సభల్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 19 మంది తమ సమస్యలను విన్నవించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వెంకన్న, ఆర్ఐ రమేష్, వీఆర్వో కృష్ణ, టీడీపీ నాయకుడు గోవింద తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లి మండలం వేటజంగాలపాలెంలో గ్రామ సభ జరుగుతున్న దృశ్య

వర్షాలతో పంటలకు మేలు

» ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తారంగా కురిసినందున ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో వ్యవసాయానికి మంచి అనుకూలమని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. శనివారం ఆర్ఏఆర్ఎస్‌లో జరిగిన జిల్లా వ్యవసాయ సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఖరీఫ్ వరి సాగు 105 శాతానికి పెరిగిందన్నారు. అపరాలు 75 శాతం, చిరుధాన్యాల సాగు 67 శాతానికి పెరగడం విశేషమన్నారు. ఖరీఫ్ సాధారణ వర్షపాతం కంటే 11 శాతం అధికంగా నమోదైందని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు మాట్లాడుతూ రాబోయే రబీ కాలం అపరాలు, నువ్వు పంటలకు అనుకూలమన్నారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, శాస్త్ర వేత్తలు డాక్టర్ కేవీ రమణమూర్తి, డాక్టర్ శ్రీలత, శ్రీదేవి, ఉమామహేశ్వరరావు తదితర శాస్త్ర వేత్తలు, వ్యవసాయాధికారారులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థుల మెరిట్ లిస్టు విడుదల

అనకాపల్లి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో టీచింగ్ (కాంట్రాక్టు), నాన్ టీచింగ్ (ఔట్‌సోర్సింగ్) పద్ధతిలో పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల టెంటేటివ్ మెరిట్ లిస్టులను డీఈవో ఏకేపీ డాట్ కమ్, ఏపీఎస్ఎస్ఏకేపీ డాట్ కమ్ వెబ్‌సైట్‌లో సబ్జెక్టుల వారీగా ఉంచినట్టు జిల్లా విద్యా శాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు అభ్యర్థులు టెంటేటివ్ మెరిట్ లిస్టుల్లో ఉన్న వివరాలు, మార్కులు పరిశీలించి అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21వ తేదీ సోమవారం సాయంత్రం ఐదు గంటలలోగా జిల్లా పథక సమన్వయకర్త, సమగ్రశిక్ష కొప్పాకలో గల కార్యాలయానికి అందించాలని ఆమె సూచించారు..

అబద్దాలు చెప్పడంలో జగన్‌రెడ్డి దిట్ట : బుద్ద

తుమ్మపాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అబద్దాలు చెబుతూ ప్రజలను మోసం చేయడంలో ప్రతిపక్ష నేత జగన్‌రెడ్డి దిట్ట అని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు విమర్శించారు. ఇక్కడి పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి కుయుక్తులను కనిపెట్టిన రాష్ట్ర ప్రజలు అందుకే పదకొండు స్థానాలకు పరిమితం చేశారన్నారు. ప్రజాధనాన్ని దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న అధికారులను తీసుకువచ్చి పలు శాఖలను కట్టబెట్టారని దుయ్యబట్టారు. ప్రధానంగా గనుల శాఖలో వెంకటరెడ్డిని, ఎక్సైజ్ శాఖలో వాసుదేవరెడ్డిని నియమించుకుని కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని స్వాహా చేశారని ఆరోపించారు. అవినీతి, ఆర్థిక నేరాలపై ఆరోపణలు ఎదుర్కొంటున్న జగన్‌రెడ్డికి ఉచిత ఇసుక, మద్యం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ, బుద్ద కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

'డీపీఎన్'లో విద్యార్థులకు పోటీలు



బహుమతులు అందజేస్తున్న నాయకులు

కశింకోట, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక డీపీఎన్ హైస్కూలులో విద్యార్థులకు శనివారం డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రీన్ ట్రీస్ చారిటబుల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పార్టీ నేత కర్రి రామకృష్ణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీజె ప్రసాద్, గ్రీన్ ట్రీస్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డి.సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి మండల సమావేశం రేపు

తుమ్మపాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సమావేశం జరగనుందని ఎంపీడీవో నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్టు వివరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

గుండెపోటుతో మృతిచెందిన జవానుకు అంత్యక్రియలు

» పరవాడపాలేనికి చెందిన నాయుడుబాబు లేహ్‌లో విధులు

» ఎయిర్‌పోర్టులో ఉండగా ఛాతీ నొప్పి.. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

» స్వగ్రామంలో ఉన్నతాధికారులు నివాళి.. అధికార లాంఛనాలతో దహన సంస్కారం



పార్థివ దేహంపై జెండా కప్పుతున్న అధికారులు (అంతర్ చిత్రం) నాయుడుబాబు, లాంఛనాలతో అంత్యక్రియలు

కశింకోట, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పరవాడపాలేనికి చెందిన ఆర్మీ జవాను పరవాడ నాయుడుబాబు (38) గుండెపోటుతో గురువారం లేహ్‌లో మృతి చెందారు. జమ్మూకాశ్మీర్ పరిధి లేహ్ సెక్షన్‌లోని కార్ప్స్ ఆఫ్ ఇంజనీర్స్ రెజిమెంట్‌లో పని చేస్తున్న ఈయన గురువారం ఉదయం కొండపై నుంచి ఆర్మీ హెలీకాప్టర్‌లో లేహ్ ఎయిర్ పోర్టు వద్ద దిగారు. అక్కడి నుంచి ఎయిర్‌పోర్టు లోపల బ్యాగులు తనిఖీ చేయించుకుంటుండగా ఛాతిలో నొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే ఎయిర్‌పోర్టు సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నాయుడుబాబు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, ఈనెల 26న స్వగ్రామంలో గౌరీపరమేశ్వరుల పండుగకు వచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారని వాపోయారు. ఇతనికి ఏడాది క్రితం శాంతి స్వరూపతో వివాహమైంది. నాయుడుబాబు మృతదేహానికి నేవీకి చెందిన ఐఎన్ఎస్ డేగా కమాండింగ్ ఆఫీసర్ మనోజ్‌యాదవ్, స్టేషన్ హెచ్‌క్యూ (ఆర్మీ) కల్నల్ విక్రాంత్‌పాండే తదితరులు పరవాడపాలెం శ్మశానవాటిలో శనివారం లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఇతని మృతదేహానికి పలువురు నివాళులర్పించారు.

కోర్టు సముదాయంలో 'స్వచ్ఛత హీ సేవ'

» పదవ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య తదితరులు హాజరు



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీవిద్య

అనకాపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కోర్టు సముదాయంలో శనివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పదవ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోర్టు సముదాయ ప్రాంతంలోని చెత్తాచెదారాన్ని న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది తొగించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీవిద్య మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అంతా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ధర్మారావు, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమేష్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంజేవీఎస్ కుమార్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

తిక్కవానిపాలెం బీచ్‌లో...



బీచ్‌ను శుభ్రం చేస్తున్న అధికారులు

పరవాడ: తిక్కవానిపాలెం బీచ్‌లో శనివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీ డీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్, పంచాయతీ విస్తరణాధికారి కె.ధర్మారావు, సచివాలయ సిబ్బంది స్థానిక యువతతో కలిసి చెత్తాచెదారాన్ని తొలగించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరారు.

తుమ్మపాలలో గంట ట్రాఫిక్ జామ్

» సంత కావడంతో పలువురు రోడ్డుపై దుకాణాల ఏర్పాటు



తుమ్మపాల మెయిన్ రోడ్డు పై నిలిచిపోయిన వాహనాలు

తుమ్మపాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని తుమ్మపాల మెయిన్ రోడ్డుపై శనివారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నియంత్రించే వారు లేకపోవడంతో గంటల తరబడి వాహనాలు మెయిన్‌రోడ్డుపై నిలిచిపోవడంతో పలువు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక్కడ వారపుసంత కావడంతో పలువురు వ్యాపారులు తమ దుకాణాలను మెయిన్ రోడ్డుపై నిర్వహించడంతో పాటు సరుకులు తీసుకు వచ్చే వాహనాలను రోడ్లపై అడ్డదిడ్డంగా నిలిపివేయడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. స్కూల్, కళాశాలల బస్సులు, ఉద్యోగస్థుల వాహనాలు, ఆయా పనులపై రాకపోకలు సాగించేవారు గంటకు పైగా మెయిన్ రోడ్డుపై నిలిచిపోయారు. భారీ వాహనాలు సైతం ఎటూ కదలలేని పరిస్థితుల్లో నానా అవస్థలు పడ్డారు. ప్రతి శనివారం ఇక్కడ జరిగే వారపు సంత జరిగే రోజుల పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చూడాలని అంతా కోరుకుంటున్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయపడిన యువకులు

డుంబ్రిగుడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆంధ్ర- ఒడిశా సరిహద్దు సోవ్వా పంచాయతీ గొప్పులవలసలో ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. ఒడిశాలోని పకలిలో జరిగిన వారపుసంతకు గసభ పంచాయతీ గొందివలసకు చెందిన వంతాల శ్రీను గిరిజన యువకుడు వెళ్తున్నారు.. ఎదురుగా ఒడిశా నుంచి ఆంధ్రవైపు వస్తున్న మరో గిరిజన యువకుడి బైక్ గొప్పులవలస సమీపంలో ఢీకొంది. ఈ సంఘటనలో గాయపడిన బాధితులకు స్థానికులు సపర్యలు చేశారు. ఒడిశాకు చెందిన యువకుడిని ఆ ప్రాంత ఆసుపత్రికి తరలించగా, గొందివలసకు చెందిన గిరి యువకుడికి108లోఅరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకువెళ్లినట్టు స్థానికులు చెప్పారు.

బంధవలస మార్గంలో కల్వర్టు నిర్మించాలి



కల్వర్టు వద్ద ఆందోళన చేపడుతున్న సీపీఎం నాయకులు, గిరిజనులు..

అనంతగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేం గడ పంచాయతీ బంధవలస గ్రామానికి వెళ్లే మార్గమధ్యలో ఉన్న కల్వర్టు నిర్మించాలని సీపీఎం నాయకులు, టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య డిమాండ్ చేశారు. కల్వర్టు వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాలకు ఈ కల్వర్టు దెబ్బతినడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గెడ్డ పొంగి ప్రవహించడంతో వేరే గ్రామాల్లో గ్రామస్థులు తలదాచుకునే పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలోని సీవేరి కొండలరావు, అప్పన్న, సింహాద్రి, దేముడు, తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన బాలుడు కేజీహెచ్‌కు తరలింపు



బాలుడిని తల్లిదండ్రులను ఒప్పిస్తున్న కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, టీడీపీ నాయకులు

అనంతగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిస్థితి విషమంగా ఉన్న బాలుడిని విశాఖ కేజీహెచ్‌కు తరలించేందుకు అధికారులు, నాయకులు శనివారం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మండలంలోని కోనాపురం పంచాయతీ చప్పాడి గ్రామానికి చెందిన వంతాల వెంకటరావు, కళావతి దంపతుల కుమారుడు సాంబ (1)ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. శనివారం పరిస్థితి విషమించడంతో వైద్య సిబ్బంది కేజీహెచ్‌కు తరలించేందుకు తరలించేందుకు ప్రయత్నించగా తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని వారిని ఒప్పించారు. అనంతరం కుమారుడిని తీసుకుని విశాఖ కేజీహెచ్‌కు అంబులెన్స్‌లో వెళ్లారు.. టీడీపీ ప్రధాన కార్యదర్శి టీ. ఆనందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకులతో స్నేహపూర్వకంగా మెలగాలి: ఎస్‌ఐ

అనంతగిరి, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): మన్యం అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులతో స్నేహపూర్వకంగా నడుచుకోవాలని అనంతగిరి ఎస్‌ఐ డీ.శ్రీనివాసరావు సూచించారు. బొర్రా మోటార్ యూనియన్ సభ్యులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుడారు.. ఈ కార్యక్రమంలోని బొర్రా యూనియన్ అధ్యక్షుడు డీ.శ్యామ్, సభ్యులు వేలు, ప్రభాకర్, గంగాధర్, విజయ్, బుజ్జి, చంటి, తదితరులు పాల్గొన్నారు.

సీలేరు పంచాయతీ కార్యదర్శిగా పరశురాం

సీలేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీ కార్యదర్శిగా పరశురాం నియమితులయ్యారు. తాజా బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావుని మైదాన ప్రాంతాలకు బదిలీకాగా ఆయన స్థానంలో పెదలబుడుకు చెందిన కార్యదర్శి పరశురాంను నియమించారు. ఈమేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.సర్పంచ్ దుర్గో పాల్గొన్నారు.

పాడేరుపై మంచు దుప్పటి



లైట్ వేసుకువస్తున్న ఆటో

పాడేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత శీతాకాలంలో మన్యంలోని ప్రకృతి అందాలు పర్యాటకుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శనివారం ఉదయం ఎనిమిది గంటల వరకు దట్టంగా పొగమంచు కమ్ముకుంది. దీంతో రోడ్డు మార్గం సరిగా కన్పించక వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. మంచు కురియడంతోప్రకృతిమరింతఅందంగా కనిపిస్తోంది.



శిథిలావస్థలో ఉన్న జీసీసీ బ్రాంచి కార్యాలయం



ప్రారంభానికి నోచకుండానే శిథిలమైన బ్రాంచ్ మేనేజర్ నివాసగృహం

భయం నీడన విధులు

- కూలేస్థితిలో జీసీసీ భవనం
- గోడలు బీటలు వారి.. స్లాబ్ పెచ్చులూడుతూ..
- అరచేతిలో ప్రాణాలతో సిబ్బంది విధులు

పైనుంచి స్లాబ్ పెచ్చులు పడతాయనే భయం.. పక్కన బీటలు వారిన గోడలు.. మరోవైపు వర్షం పడితే గదిలోకి నీరు చేరి రికార్డులు, ఫర్నీచర్ తడిసిపోతాయని ఆందోళన.. ఇన్ని యాతనలతో విధుల నిర్వహించడం కష్టమే కాదు...సాహసం కూడా. ఇన్ని విపత్కర పరిస్థితుల మధ్య కొయ్యూరు జీసీసీ బ్రాంచి కార్యాలయంలో సిబ్బంది పనిచేస్తున్నారు.

కొయ్యూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉన్న జీసీసీ బ్రాంచి కార్యాలయం నేడోరేపో కూలే స్థితిలో ఉంది. స్లాబ్ పెచ్చులు ఊడుతూ. గోడలు బీటలు వారి ఏ క్షణాన కూలుతుందో తెలియని స్థితిలో ఉన్న ఈ భవనంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో లోనికి నీరు చేరి రికార్డులు, ఫర్నీచర్ ధ్వంసమవుతోంది. అద్దె భవనంలో కొనసాగుతున్న ఈ జీసీసీ బ్రాంచి కార్యాలయానికి 1997లో అప్పటి జీసీసీ చైర్మన్ కె. చిట్టినాయుడు నిధులు కేటాయించారు.

వీటితో కార్యాలయ నిర్వహణకు వీలుగా భవనంతో పాటు దీనిని ఆనుకుని బ్రాంచి మేనేజర్ నివాస గృహాన్ని నిర్మించారు. అయితే, బీఎం నివాస గృహం ప్రారంభానికి నోచకుండానే శిథిలం కాగా, కార్యాలయభవనం నేటి వరకు కనీస మరమ్మతులకు నోచకోలేదు. ప్రస్తుతం ఈ భవనం స్లాబ్ దెబ్బతినడంతో చిన్నపాటి వర్షం కురిసినా కార్యాలయం మొత్తం తడిసి ముద్దవుతోంది. గత ప్రభుత్వ హయాంలో జీసీసీ చైర్మన్‌గా చేసిన ఓ మహిళా నేత మండలానికి వి చ్చేసి ఈ భవన నిర్మాణాలకు నిధులు కేటాయిస్తున్నట్టుగా ప్రకటించారు. కానీ, పైసా విదల్చలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోడలు నానిపోయి ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి నెలకొంది. కార్యాలయ నిర్వహణకు వేరే వసతి సౌకర్యం లేక ఇందులోనే సిబ్బంది భయాందోళనతో విధులు నిర్వహిస్తున్నారు. వర్షం కురిస్తే రికార్డులను కాపాడుకోవటం పెద్ద యజ్ఞంలా మారుతోందని సిబ్బంది వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు భవన మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.



స్లాబ్ పెచ్చులు.. గోడలు బీటలు



పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక ప్రణాళిక



లబ్బంగి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో కుమార్

చింతపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని డీఎల్‌పీవో పీఎస్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని లంబసింగి, లబ్బంగి పర్యాటక ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో లంబసింగి, తాజంగి ప్రాంతాలకు భారీ సంఖ్యలో పర్యాటకులు వస్తారన్నారు. దీంతోఎక్కడా పారిశుధ్యం సమస్య తలెత్తకుండగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. లంబసింగి, తాజంగి ప్రాంతాల్లో అదనపు కార్మికులను ఏర్పాటు చేశామన్నారు. సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముంచంగిపుట్టు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జర్జుల పంచాయతీ సంతవీధి గ్రామానికి చెందిన వి.బాబూరావు (49)పై కొంత మంది దాడి చేసి గాయపరిచారు. అతను పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ శనివారం మృతి చెందినట్టు స్థానిక ఎస్‌ఐ కె.రవీంద్ర తెలిపారు. గత 17న బాబూరావు అదే గ్రామానికి చెందిన కె.రాధాకృష్ణతోపాటు పలువురు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏపీఎఫ్‌డీసీ, కాఫీ కార్మికుల మధ్య చర్యలు విఫలం



కార్మిక సంఘాల నాయకులతో చర్చిస్తున్న ఏపీఎఫ్‌డీసీ అధికారులు

చింతపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(ఏపీఎఫ్‌డీసీ) కాఫీ కార్మిక సంఘం నాయకుల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో కార్మికుల సమస్యలపై సమ్మెకు వెళతామని నాయకులు స్పష్టం చేశారు. శనివారం స్థానిక డీఎం కార్యాలయంలో కాఫీ కార్మిక సంఘం నాయకులు, ఏపీఎఫ్‌డీసీ అధికారులు సమావేశమయ్యారు. ప్రధానంగా వీడీయే పాయింట్లు ఆధారంగా కాఫీ కార్మికులకు కూలి, పండ్ల సేకరణ ధర పెంచాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులకు 26 రోజుల పనిదినాలు కల్పన, హెల్పర్లకు ప్రమోషన్లు, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. టీఏ, డీఏలు, ఈపీఎఫ్ కల్పించాలన్నారు. ఈ సమస్యలను ఏపీఎఫ్‌డీసీ అధికారులు రీజనల్ మేనేజర్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. దీంతో చర్చల నుంచి కాఫీ కార్మిక సంఘాల నాయకులు బయటకు వచ్చేశారు. ఈ సందర్భంగా కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. లేదంటే నెలాఖరు నుంచి సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ చర్చల్లో ఏపీఎఫ్ డీసీ డివిజనల్ మేనేజర్లు కృష్ణబాబు, రత్నదీపిక, మాజీ డీఎం మహేశ్వరరావు, కాఫీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కనకవల్లి, నాయకులు సుందరరావు, వెంకటేశ్, రాజారావు పాల్గొన్నారు.

రబీలో గోధుమ, పొద్దుతిరుగుడు సాగుకు ప్రణాళిక

- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి



రైతులకు సెనగ విత్తనాలను అందజేస్తున్న ఏడీఆర్ అప్పలస్వామి

చింతపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో రబీ సీజన్‌లో గోధుమ, పొద్దుతిరుగుడు, సెనగ సాగుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శనివారం స్థానిక పరిశోధన స్థానంలో విశాఖపట్నం ఆత్మ అధికారుల సహకారంతో జిల్లా స్థాయి నెలవారీ శిక్షణ, సందర్శన కార్యక్రమం జరిగింది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు గిరిజన రైతుల పలు అంశాలను చర్చించారు. ఏడీఆర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రబీ సీజన్‌లో మెజారిటీ పంట పొలాలను రైతులు ఖాళీగా విడిచి పెడతున్నారన్నారు. గిరిజన ప్రాంతానికి అనువైన మంచు ఆధారంగా పెరిగే గోధుమ, పొద్దుతిరుగుడు, సెనగ పంటలను సాగు చేపట్టేందుకు రైతులను ప్రోత్సహించనున్నామన్నారు. ఉద్యానశాఖ అధికారి కంటా బాలకర్ణ మాట్లాడుతూ మామిడి, పైనాపిల్, డ్రాగన్‌ఫ్రూట్, మిరియాలు, జీడిమామిడి సాగుకి ప్రభుత్వం రాయితీ అందజేస్తోందన్నారు. జీకేవీధి మండలంలోని దామనాపల్లి గ్రామానికి చెందిన అభ్యుదయ రైతులకు కొమ్ముసెనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఏడీఏ కంటా జాహ్నవి, శాస్త్రవేత్తలు డాక్టర్ పి. బాల హాస్సేన్ రెడ్డి, డాక్టర్ వెంకటేశ్ బాబు, సందీప్ నాయకుడు, జోగారావు, అరకు ఏడీఏ మోహన్‌రావు, ఏవోలు శ్రీనివాసరావు, మధుసూదనరావు, ఉమాదేవి, డీఆర్‌సీ అధికారి విజయలక్ష్మి, ఎఫ్‌పీవో రైతులు పాల్గొన్నారు.

పండ్లతోటల సంరక్షణపై శ్రద్ధ వహించాలి

చింతపల్లి:ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు సాగు చేపడుతున్న పండ్ల తోటల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో పి. ఆశాజ్యోతి అన్నారు. వనివారం మండలంలోని చౌడుపల్లి పంచాయతీ గాడిదెలమెట్ట, గొయ్యిలమెట్ట గ్రామాల్లో గిరిజన రైతులు సాగుచేస్తున్న పండ్ల తోటలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఉపాధి హామి పథకం ద్వారా పండ్ల తోటల మొక్కలు ఉచితంగా అందజేశామన్నారు. పక్కా గృహాల లబ్ధిదారులకు ఉపాధి పథకంలో 90రోజుల పనిదినాలు కల్పిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏపీవో కొక్కుల లక్ష్మీనారాయణ, హౌసింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్ రమణ, కార్యదర్శి శివ పాల్గొన్నారు.

కేజీబీవీ పోస్టుల భర్తీకి ధ్రువపత్రాల పరిశీలన

- 42 ఉద్యోగాలకు 436 దరఖాస్తులు రాక



అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేస్తున్నన్న విద్యాశాఖాధికారులు

పాడేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ మండలాల్లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని ఖాళీల భర్తీకి దరఖాస్తులు చేసుకున్న (మహిళలు మాత్రమే) అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ శనివారం కలెక్టరేట్‌లో సజావుగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 42 పోస్టులకు మొత్తం 436 మంది దరఖాస్తు చేశారు. 3 ప్రిన్సిపల్ పోస్టులకు 38 మంది, 4 అకౌంటెంట్ పోస్టులకు 52, 1 వార్డెన్ పోస్టుకు 68, 34 కాంట్రాక్ట్ టీచర్ పోస్టులకు 278 మంది దరఖాస్తులు వచ్చాయి. డీఈవో బ్రహ్మజీరావు ఆధ్వర్యంలో శని, ఆదివారాలు ధ్రువపత్రాల పరిశీలనకు చర్యలు చేపట్టారు. అందుకు 12 కౌంటర్లు ఏర్పాటు చేసి, తొలి రోజు శనివారం 80 శాతం పైబడి వచ్చిన అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలించారు. ఈకార్యక్రమంలో జిల్లా బాలికా సంరక్షణాధికారి సూర్యకుమారి, పలువురు ఎంఈవోలు, డీఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

2000 మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలు

- జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి



మడిగుంటలో కాఫీ రైతులతో మాట్లాడుతున్న జీసీసీ ఎండీ

చింతపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విదేశీ ఎగుమతులకు అనువైన నాణ్యమైన కాఫీ ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నామని గిరిజన సహకార సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి అన్నారు. శనివారం ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌తో కలిసి మండలంలో ఆమె పర్యటించారు. మ్యాక్స్ నిర్వహిస్తున్న ఎకో పల్పింగ్ యూనిట్‌ని సందర్శించి, కాఫీ పార్చిమెంట్ ఉత్పత్తిని అడిగి తెలుసుకున్నారు. మడిగుంట గ్రామంలో కాఫీ తోటలను పరిశీలించిన ఆమె నాణ్యమైన కాఫీ ఉత్పత్తికి తీసుకోవాల్సిన మెలకువలను వివరించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో పాడేరు రెవెన్యూ డివిజన్ జీసీసీ ఉద్యోగులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అరకు కాఫీకి దేశ, విదేశాల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. అరకు కాఫీ బ్రాండ్‌ను కాపాడుకుంటూ గరిష్ఠ ధరలు పొందేందుకు ఆదివాసీ రైతులు నాణ్యమైన కాఫీని ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాలను జీసీసీ ఉద్యోగులు గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ ఏడాది చింతపల్లి, పాడేరు డివిజన్ల పరిధిలో జీసీసీద్వారా రెండు వేల మెట్రిక్ టన్నుల కాఫీ గింజల సేకరణ లక్ష్యంగా నిర్ణయించామని జీసీసీ ఎండీ కల్పనా కుమారి అన్నారు. గిరిజన ప్రాంతంలో ఏటా 18వేల మెట్రిక్ టన్నుల కాఫీ దిగుబడులు వస్తున్నాయన్నారు. గింజలను భద్రపర్చేందుకు 17 గోదాములను సిద్ధం చేశామన్నారు. ఈ ఏడాది నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కాఫీ రైతులకు జీసీసీ ద్వారా అంతర్జాతీయ ధరలు అందించనున్నామన్నారు. జీసీసీ ఉద్యోగులు గింజలు సేకరించిన 24 గంటల్లో రైతుల వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. జీసీసీ ఉద్యోగులు కాఫీ గింజల సేకరణలో అక్రమాలకు పాల్పడినా, ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు, విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఐటీడీఏ పీవో వి. అభిషేక్ మాట్లాడుతూ తొలిసారిగా జీసీసీ, మ్యాక్స్ సంయుక్తంగా కాఫీ గింజలకు మార్కెటింగ్ కల్పిస్తుందన్నారు. జీసీసీ మంచి ధర ప్రకటించిందని, రైతులు సదినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీసీసీ పాడేరు జీఎం ఉమాదేవి, సీనియర్ మేనేజర్ శ్రీనివాస్, చింతపల్లి డీఎంలు సింహాచలం, పి. దేవరాజు, కాఫీ ప్రాజెక్టు అధికారి ఎస్. అశోక్, బ్రాంచి మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్



తెలుగు యువత నేత కేపీ సురేశ్‌కుమార్

రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన టీడీపీ నేతలు

పాడేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను గిరిజన ప్రాంతానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు.గత రెండు రోజులు విశాఖలో ఉన్న లోకేశ్‌ను, టీడీపీ అరకులోయ పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకటసురేశ్‌కుమార్ , టూరిజం కార్పొరేషన్ సభ్యుడు కిల్లు వెంకటరమేశ్‌నాయుడు వేర్వురుగా కలిశారు. ఈసందర్భంగా గిరిజన ప్రాంత సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లామని ఆ నేతలు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి: డీఎంహెచ్‌వో



బారాపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జమీల్‌బాషా

పాడేరురూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మన్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, రోగులకు సకాలంలో వైద్య సేవలను అందించాలని డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా సూచించారు. శనివారం ఆయన హుకుంపేట పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్యమందుతున్న తీరును అడిగితెలుసున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. వైద్యాధికారి సౌజన్య, పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశమయ్యారు. మెరుగైన వైద్య సేవలకు పలు సూచనలందించారు. అనంతరం బారాపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలువురికి వైద్య సేవలందించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. టీబీ రోగులు మందులను సక్రమంగా వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎ న్ జమ్మి, టీబీ సూపర్‌వైజర్ సదానందం, ఏఎన్‌ఎంలు సుశీల, గాయత్రి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టేకు వనాల సంరక్షణకు పటిష్ట చర్యలు: డీఎఫ్‌వో



పంపింగ్ స్టోరేజ్ మ్యాప్ పరిశీలిస్తున్న డీఎఫ్‌వో నరసింహరావు

సీలేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ పరిధి టేకు వనాల సంరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు చింతపల్లి డివిజనల్ ఫారెస్టు అధికారి వై. వెంకట నరసింహరావు అన్నారు. శనివారం అటవీశాఖ టింబరు డిపో వెనుకనున్న టేకు ప్లాంటేషన్ ఆయన పరిశీలించారు. రేంజ్ పరిధి అటవీశాఖ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ టేకు వనాలపై ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రేంజ్ పరిధిలో 80వేల జాఫ్రా, సిల్వర్ ఓక్, ఇతర మారుజాతి మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఎఫ్‌వో పంపుడు స్టోరేజ్ ప్రాజెక్టు స్థలాన్ని పరిశీలించారు. ఈ స్టోరేజ్ మ్యాప్, సరిహద్దు రాళ్లను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎస్ఈ చంద్రశేఖరరావు, ఏపీ జెన్‌కో ఈఈ భాస్కరావు, డిఈఈ టి. అప్పలనాయుడు, సీలేరు రేంజ్ అధికారి సుంకరి వెంకటరావు, డీఆర్‌వో సింహాచలం పడాల్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

గూడెంకొత్తవీధి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు కల్పించాలని బొడ్డమానుపాకలు గ్రామానికి చెందిన ఆదివాసీలు కోరారు. శనివారం గ్రామానికి చెందిన గిరిజనులు విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో 40ఆదివాసీ కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. అందరికీ జాబ్ కార్డులున్నా మూడేళ్లుగా ఉపాధి పనులు కల్పించడంలేదన్నారు. పలుమార్లు మండల పరిషత్ అధికారులకు ఉపాధి పనులు కల్పించాలని కోరినా పట్టించుకోవడంలేదన్నారు. ఉపాధి పథకం వర్తించక పీఎం జన్‌మన్ పక్కా గృహాలను సైతం కోల్పోయమన్నారు. ఇప్పటికైన అధికారులు న్యాయంచేయాలని గ్రామ పెద్దలు అప్పారావు, నారాయణరావు, బాలరాజు విజ్ఞప్తి చేశారు.

'కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి'



మాట్లాడుతున్న టీడీపీ నేత నాగరాజు

పాడేరురూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు పల్లె పండుగ వారోత్సవాలు ఎంతగానో దోహదపడుతున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు బొర్రా నాగరాజు అన్నారు. శనివారం వనుగుపల్లి తామరాపల్లిలో, కించూరు, గొండెలి పంచాయతీలలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సొనాయి రత్నకుమారి, మాజీ ఎంపీపీ రమణ మూర్తి, వనుగుపల్లి సర్పంచ్ వంతాల మీన, ఉప సర్పంచ్ సింహాచలం, ఎంపీటీసీ సభ్యురాలు రేగం భానుమతి, మాజీ ఎంపీటీసీ సభ్యులు డుంబేరు రమణబాబు, టీడీపీ నాయకులు రేగం బాలకృష్ణ, బొర్రా మణికంఠరాజు, కనకరాజు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: గిరిజన గ్రామాల అభివృద్ధికి రా ష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు అన్నారు. శనివారం యర్రబొమ్మలులో నిర్వహించిన పల్లెపండుగలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ లోత పండయ్య, ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు, నాయకుడు బేరా సత్యనారాయణ పడాల్, మామిడి పెదరాజు పాల్గొన్నారు.


గిరిజన గ్రామాలకు నిధులు

డుంబ్రిగుడ: గిరిజన గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. మండలంలోని అరకు, పో తంగి, కొల్లపుట్టు పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సర్పంచి వెంకటరావు, ఎంపీటీసీ సభ్య రాలు గీత, కూటమి నాయకులు స్వామి, ఆనంద్, చిన గెన్ను, సిహద్రి, సూరిబాబు, ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్లాయిపుట్టులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ముంచంగిపుట్టు: లక్ష్మీపురం పంచాయతీ అర్లాయిపుట్టులో శనివారం సర్పంచ్ కె.త్రినాథ్, ఎన్ఈజీఈఎస్ ఏపీవో నాయుడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజా ప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు,దూడ మృతి



మృతి చెందిన పశువులు

జి.మాడుగుల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గెమ్మెలి పంచాయతీ గొడుకురాయి గ్రామానికి చెందిన వంజరి పిన్నంనాయుడుకు చెందిన ఆవు, దూడ పిడుగు పాటుకు గురై మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం ఆవు, దూడను మేతకు సమీపంలోని కొండపై తీసుకువెళ్లి తిరిగి ఇంటికి తోలుకు వచ్చి పాకలో కట్టాడు. కొద్ది సేపటికి గాలి వీచి పెద్ద పిడుగు పడడంతో ఆవు, దూడ మృతి చెందాయి. దీంతో పిన్నంనాయుడు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

మురుగు కదలదు.. కంపు వదలదు!

వీధుల్లో మురికి నీటి నిల్వలు.. రహదారుల మధ్యలో బురద కుంటలు.. ఎక్కడికక్కడే చెత్త కుప్పలు.. కళ్లెదురుగానే ఇంత దారుణ పరిస్థితి ఉన్నా కనీసం పట్టించుకోని అధికారులు.. వెరసి భరించలేని దుర్వాసన, దోమల బెడదతో భయాందోళనలో ప్రజలు.. ఇదీ మేజర్ పంచాయతీ ఏఎల్.పురంలోని దుస్థితి.

ఏఎల్.పురం మేజర్ పంచాయతీలో పారిశుధ్యం.. దారుణం

- రహదారులపైనే మురికి నీటి నిల్వలు
- ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త కుప్పలు
- దోమల స్వైరవిహారం.. భయాందోళనలో జనం



ఎస్సీ కాలనీలోని సీసీ రోడ్డుపై మురికి కుంట

కృష్ణాదేవిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్.పురంలో సుమారు రెండు వేల ఇళ్లు ఉన్నాయి. 20 వేల మందికిపైగా జనాభా నివసిస్తున్నారు. ఇంత పెద్ద పంచాయతీలో పది మంది పారిశుధ్య కార్మికులే పనిచేస్తున్నారు. వీరంతా మెయిన్ రోడ్డులోని పనులకే పరిమితమవుతున్నారు. పంచాయతీకి ఏటా రూ.లక్షల్లో ఆదాయంతో పాటు ఆర్థిక సంఘం నిధులు వస్తున్నాయి. వీటిని సద్వినియోగం చేయకపోవడంతో పంచాయతీ అభివృద్ధికి దూరంగా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా పంచాయతీ పరిధిలోని ఏ వీధి చూసినా చెత్త వాతావరణం తారసపడుతోంది. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. వీధుల్లో మురికి నీటి నిల్వలు రోజుల తరబడి ఉంటున్నాయి. రహదారుల మధ్యలోనే బురద ఉండడంతో అడుగు కూడా ముందుకు వేయలేని దుస్థితి. అలాగే ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోవడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది.



ఏఎల్.పురం-కొంగసింగి రోడ్డు పక్కన గుట్టలుగా ఉన్న చెత్త కుప్పలు



వినాయకవీధిలోని సీసీ రోడ్డుపై ఇళ్ల ముందు పేరుకుపోయిన మురుగు నీరు

ప్రధానంగా ఏఎల్.పురం హైస్కూల్ రోడ్డు, వినాయకవీధి, గొల్లపేట, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, సినిమా హాలు వద్ద పెట్రోల్‌బంకువీధి తదితర ప్రాంతాలు చెత్తాచెదారాలు, మురుగునీటి నిల్వలతో దర్శనమిస్తున్నాయి. ఏఎల్.పురంలోని కొంగసింగి గ్రామానికి, బీసీ కాలనీకి వెళ్లే రహదారిలో నెలలు తరబడి చెత్తకుప్పలు రోడ్డుకిరువైపులా పేరుకుపోయాయి. వీధుల్లో రహదారులు, ఇళ్ల ఎదుట దుర్వాసనతో స్థానికులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. పగలు, రాత్రులు తేడా లేకుండా దోమల స్వైరవిహారం చేస్తుండడంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పాలకులకు, అధికారులకు ఫిర్యాదులు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని వారు మండిపడుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పరిస్థితి మరీ దయనీయంగా మారిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి మేజర్ పంచాయతీలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

రోడ్డుపై మురుగుతో నరకం చూస్తున్నాం

-మడ్డు మంగ, వినాయకవీధి, ఏఎల్.పురం



మా వీధిలో డ్రైనేజీలు ఉన్నప్పటికీ పూడికతీయక నీరు ఎటుపోలేని పరిస్థితి. దీంతో మురుగు నీరు సీసీ రోడ్డుపైనే తిష్ట వేసింది. మరికొన్ని చోట్ల సీసీ రోడ్లపై మురుగు నీరు పారుతోంది. దీంతో ప్రజలతో పాటు వాహనదారులు రాకపోకలు సాగించడానికి ప్రత్యక్ష నరకం చూస్తున్నాం. ఈ సమస్యపై అధికారులు, పాలకులు వెంటనే స్పందించాలి.

కాలువలు, కల్వర్టులు నిర్మించాలి

-గుడ్ల సుభద్ర, ఎస్సీ కాలనీ, ఏఎల్.పురం



మా కాలనీలో మురుగు నీరు పోయే పరిస్థితి లేదు. సీసీ రోడ్లు ఉన్నప్పటికీ కల్వర్టులు, డ్రైనేజీ లేక ఇళ్లల్లోని వాడిన మురుగు నీరు రోడ్డు మధ్యలోను గృహాల ముందు నిల్వలు ఉంటున్నది. దీంతో భరించలేనంతగా దుర్వాసన వస్తోంది. ఈ సమస్యలతో ప్రతి రోజూ పరిసర వాసులతో తగాదాలు పడుతున్నాం. అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలి.



శేమునాపల్లిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజు

పల్లెల్లో అభివృద్ధి పరుగులెత్తిస్తాం..

» 'పల్లె పండగ'లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు అభివృద్ధికి దూరంగా ఉండిపోయిన గ్రామ పంచాయతీల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు పెట్టిస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. మండలంలోని 26 పంచాయతీల్లో శనివారం పల్లె పండగ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు ఇతర అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో పంచాయతీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీలకు నిధులు కేటాయింపుతో పాటు అధికారాలు కూడా కల్పించిందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ మహేష్, పీఆర్ డీఈ ప్రసాద్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజుకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న చంద్రబాబు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే రాజుకు సీఎం చంద్రబాబు అమరావతిలో పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజా ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సమస్యలు పరిష్కరించడంతో పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని సీఎం సూచించినట్టు ఎమ్మెల్యే చెప్పారు.

చెరకు రైతులను ఆర్థికంగా ఆదుకోండి

» మంత్రి లోకేశ్‌కు జనసేన ఇన్‌చార్జి రాజు వినతి



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

చోడవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గోవాడ చెరకు రైతులు, ఫ్యాక్టరీని ఆర్థికంగా ఆదుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు కోరారు. ఈ మేరకు శనివారం విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రి లోకేశ్‌కు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబుతో కలిసి వినతిపత్రం అందించారు. గతంలో చోడవరం పర్యటనలో లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు చెరకు రైతులకు ఆర్థిక సాయం అందించడంతో పాటు ఫ్యాక్టరీ మనుగడకు అవసరమైన ఆర్థిక తోడ్పాటునందించాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని రాజు తెలిపారు.

తాతయ్యబాబును కలిసిన పీడీ శ్రీనివాస్



తాతయ్యబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పీడీ శ్రీనివాస్

బుచ్చెయ్యపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబును శనివారం ఆయన స్వగృహంలో జిల్లా హౌసింగ్ బోర్డు పీడీ వై.శ్రీనివాస్, డీఈఈ ఎస్వీఎస్ శ్రీనివాసరావు, ఏఈ అనిల్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తాతయ్యబాబుకు శాలువ కప్పి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాలో హౌసింగ్ పనితీరుపై తాతయ్యబాబు ఆరా తీశారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లు పూర్తయ్యేలా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



వేములపూడిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సమగ్ర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, వేములపూడి ఎంపీటీసీ సభ్యుడు బోళెం రామ్‌ప్రసాద్ అన్నారు. వేములపూడి, మెట్టపాలెంలో శనివారం పల్లె పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లె పండగ ద్వారా ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంతకు ముందు వేములపూడిలో రూ.22 లక్షలు, మెట్టపాలెంలో రూ.10 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నక్కపల్లి నూకాలమ్మ, కె.అర్జున, టీడీపీ మండల అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలి

మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్



బెటాలియన్ అధికారికి షీల్డ్ బహూకరణ

మాకవరపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక అవంతి కళాశాలలో శనివారం జరిగిన నూతన విద్యార్థుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. సాంకేతికతను అనుసరించి అన్ని విభాగాలలో వినూత్న పరిజ్ఞానాన్ని పొందుపరచాలని సూచించారు. విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. అందు ఎన్‌పీటీఎల్ వంటి కోర్సులు పూర్తి చేయాలన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ విజయనగరం ప్రొఫెసర్ జి.జయ, విశాఖపట్నం 13వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ నీరజకుమార్, టెక్నాలజీ మానవ వనరుల శాఖాధికారి సురేష్‌కుమార్, ప్రిన్సిపాల్ మోహనరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు వరహాపురం విద్యార్థి



గుణప్రసాద్‌తో ఉపాధ్యాయులు

చీడికాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరహాపురంలో పదో తరగతి చదువుతున్న ఎస్.గుణప్రసాద్ రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారని హైస్కూల్ హెచ్ఎం డి.వరహామూర్తి, పీడీ ఆర్.సింహాచలం శనివారం తెలిపారు. ఈనెల 20, 21, 22 తేదీల్లో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో జరిగే పోటీలకు గుణప్రసాద్ హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు.

సచివాలయాలకు చెత్త బుట్టల పంపిణీ



శానిటరీ సెక్రటరీలకు డస్ట్‌బిన్‌లు అందిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని 17 సచివాయాలకు చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, 26వ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి చేతుల మీదుగా శనివారం చెత్త బుట్టలు పంపిణీ జరిగింది. పుష్‌కార్ట్‌కి ద్వారా చెత్త సేకరణ చేయడానికి అవసరమైన డస్ట్‌బిన్‌లను ఒక్కొక్క సచివాలయానికి నాలుగు చొప్పున శానిటరీ సెక్రటరీలకు అందించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు వర్క్ ఆర్డర్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలల కాలంలోనే పురపాలక సంఘంలో రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు వర్క్ ఆర్డర్లు రావడం సంతోషంగా ఉందని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. శనివారం సచివాలయానికి డస్ట్‌బిన్లు పంపిణీ తర్వాత విలేకరుతో ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటు పడిందని, మునిసిపాలిటీ అభివృద్ధికి ఒక్క రూపాయ కూడా మంజూరు చేయించుకోలేకపోయారని విమర్శించారు. వీధి లైట్లు వెలకగపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీధిలైట్లు బాగుచేయించామ ఆమె తెలిపారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు పార్టీలకు అతీతంగా వార్డులలో అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ డబ్బీరు శ్రీకాంత్, నాయకులు రాజులనాయుడు, డి.మధు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

దేవరాపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కక్కల దుర్గాప్రసాదు అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బి.రాధ తెలిపారు. తెనుగుపూడి బీఆర్ అంబేడ్కర్ బాలుర విద్యాలయానికి చెందిన జి.అజయ్, పోతుబంది సాయికుమార్ అండర్-17 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పి.రఘు తెలిపారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు తరుణేశ్వరరావు, బాబూరావులను జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రూపవతి అభినందించారు.

మార్చిలోగా కాలనీ ఇళ్లు పూర్తిచేయాలి

» గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్

బుచ్చెయ్యపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలాఖరులోగా కాలనీ ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోతాయని గృహ నిర్మాణ శాఖ పీడీ వై.శ్రీనివాస్ స్పష్టం చేశారు. అందువల్ల లబ్ధిదారులు గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. శనివారం ఆయన వడ్డాది 1, 2, 3 లేఅవుట్లకు మంజూరైన 243 ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పునాదులు కట్టని 40 ఇళ్లపై డీఈఈ ఎస్వీఎస్.శ్రీనివాసరావును ప్రశ్నించారు. తక్షణం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న 50 ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. బిల్లుల పెండింగ్ సమస్య లేదని, శతశాతం నిర్మాణాలు పూర్తిచేయాలని పీడీ కోరారు. ఆయన వెంట ఏఈ అనిల్, టీడీపీ వడ్డాది అధ్యక్షుడు డినరేష్ ఉన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

చీడికాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ వైవీఎస్.ప్రసాద్ సూచించారు. మండలంలోని ఎల్‌బి.పట్నం గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగిన ఈ సదస్సులో వివిధ అర్జీలు వచ్చాయి. సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ కె.నారాయణమూర్తి, ఆర్ఐ కృష్ణంరాజు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీదేవి ఆలయ గోపురానికి రూ.2 లక్షల విరాళం

మాడుగుల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీదేవి ఆలయ గోపుర నిర్మాణానికి దాతలు రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. మాడుగులకు చెందిన సాలూరు గోకులదాస్, సరోజినీదేవి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు బాబాకృపానిధి, భారతిదేవి దంపతులు శ్రీదేవి ఆలయ గర్భగుడిపైన గోపురం నిర్మాణానికి ఈ మొత్తాన్ని అందించారు. ఆలయ అభివృద్ధికి దాతలు విరాళాలు అందించి సహకరించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

1400 లీటర్ల బెల్లం పుసులు ధ్వంసం

రావికమతం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట శివారు డోలవానిపాలెం కొండల్లో ఎస్ఐ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేసి 1400 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. సారా తయారీ వినియోగిస్తున్న వంట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నాటు సారా తయారీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

'గద్దర్ యాదిలో'ను విజయవంతం చేయండి

దేవరాపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధ నౌక గద్దర్ అన్న యాదిలో కార్యక్రమాన్ని ఈ నెల 20న విశాఖలో నిర్వహించనున్నట్టు బహుజన కళా మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటపల్లి అప్పారావు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

గొలుగొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పోలవరం గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపడతామని ఈ సందర్భంగా రైతులకు తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, వీఆర్‌వో రాజు, మండల సర్వేయర్ పాల్గొన్నారు.

రోలుగుంటలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

రోలుగుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక పారిశుధ్య నివారణ కార్యక్రమాన్ని చేపట్టారు. హైస్కూల్‌లో పేరుకుపోయిన తుప్పలు, చెత్తను తొలగించారు. కార్యక్రమంలో కార్యదర్శులు చిరంజీవి, రాజశేఖర్ పాల్గొన్నారు.

జనావాసాల్లో మద్యం షాపు వద్దు

చోడవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గోవాడలో జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు కోరారు. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. మద్యం దుకాణాలతో మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామ సచివాలయ సిబ్బందిపై డీపీవో ఆగ్రహం

బుచ్చెయ్యపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేట గ్రామ సచివాలయ సిబ్బందిపై డీపీవో శిరిషారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బుచ్చెయ్యపేట శివారు నేతవానిపాలెంలో జరుగుతున్న పారిశుధ్య పనుల్లో ఆమె పాల్గొన్నారు. స్వయంగా చీపురు పట్టుకుని చెత్త ఊడ్చారు. ప్రతీ శనివారం అధికారులు, సచివాలయాల ఉద్యోగులు పారిశుధ్య పనుల్లో పాల్గొనాల్సి ఉండగా, మండలంలోని ఉద్యోగులు పాల్గొకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై హాజరుకాకపోతే చర్యలు చేపట్టాలని ఈవో లవరాజును ఆదేశించారు. సీసీ రోడ్లపై బహిరంగ మల విసర్జన చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో అలక్ష్యం వహిస్తే సంహించేది లేదన్నారు. ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో గ్రామాల్లో పండగ వాతావరణం

పల్లె పండగలో ఎమ్మెల్యే బండారు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని వీరనారాయణం, వమ్మలి, సత్యవరం, గాదిరాయి గ్రామాల్లో శనివారం పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పూర్తి చేసిన పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెలను ప్రగతి పథంలోకి తీసుకువెళ్లడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ జగన్నాథరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, నాయకులు దేముడు, ఎన్.సన్యాసిరావు, సింహాచలంనాయుడు, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



కొత్తఎల్లవరంలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

గొలుగొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రోడ్లు, కాలువల నిర్మాణాలకు కూటమి నాయకులు శనివారం శంకుస్థాపన చేశారు. రూ.2.6 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లి సత్యనారాయణ, కొల్లి రాంబాబు, గుమ్మిడి చినబ్బాయి, కామిరెడ్డి గోవింద్, బి.సత్యనారాయణ, కశిమి బాబూరావు, కొల్లి గోవింద, కర్రి నాయుడు, శెట్టి శివకుమార్, శెట్టి దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: చోద్యం గ్రామంలో శనివారం సీసీ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ ఎ.గోపాలకృష్ణ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.గోపి, జడ్పీటీసీ మాజీ సభ్యులు సిహెచ్.తారకవేణుగోపాల్, మాజీ సర్పంచ్ ఎ.ప్రభాకర్, నాయకులు దేవాడ శేషు, స్వామినాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండల కేంద్రంతో పాటు వజ్రగడ, తామరం, కొండలఅగ్రహారం తదితర గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.40 లక్షలతో ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించనున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రుత్తల శేషుకుమార్, సర్పంచ్ అల్లంపల్లి శిరీషా, ఉప సర్పంచ్ లాలం రాము, నాయకులు అల్లు రామునాయుడు, తమరాన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందలో తరచూ పోతులను మార్చాలి

రోలుగుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకందారులు మందల్లోని పోతు గొర్రెలను తరచూ మారుస్తూ ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామ్మోహన్‌రావు సూచించారు. మండలంలో జరుగుతున్న సామూహిక గొర్రెలు, మేకల ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మునిపల్లి శివారు గొల్లపేటలో సన్న జీవాల పెంపకందారులతో సమావేశయ్యారు. నిర్దేశిత సమయాల్లో నట్టల నివారణ చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందించే వ్యాక్సినేషన్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. తద్వారా గొర్రెలు బరువుతో పాటు మందలో పిల్లల సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయకులు ఎస్.యశోద, పశు వైద్యాధికారి నూకేశ్వరరావు, సిబ్బంది గణపతి, శివ, రాజు, భవాని, సాయి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కేసులు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరావు హెచ్చరించారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ దీపావళి పండగ సందర్భంగా బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. అనుమతులు లేకుండా విక్రయిస్తే కేసులు నమోదు చేయక తప్పవని హెచ్చరించారు. అనుమతి విక్రయాలు చేస్తే 94409 04240 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.


నాతవరంలో స్వచ్ఛభారత్

నాతవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, అధికారులతో కలసి సర్పంచ్ గొలగాని రాణి చెత్తను ట్రాక్టర్‌పై వేశారు. ఇంటిలో చెత్తను కుండీల్లోనే వేయాలని, అందరూ పరిశుభ్రత పాటించాలని ఈ సందర్భంగా సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పైల పోతురాజు, ఉప సర్పంచ్ కరక అప్పలరాజురెడ్డి, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, పంచాయతీ కార్యదర్శి శేషు పాల్గొన్నారు.

చోడవరం కోర్టులో...

చోడవరం: స్థానిక కోర్టుల సముదాయంలో శనివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు పరిసరాలను జడ్జిలతో పాటు న్యాయవాదులు పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి కె.రత్నకుమార్, సీనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాండ్రేగుల డేవిడ్, కార్యదర్శి గొర్లె కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



ఎ.కొత్తపల్లి పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్జేడీ

దేవరాపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎ.కొత్తపల్లి జడ్పీహెచ్ పాఠశాలను ఆర్జేడీ విజయభాస్కర్, డీఈవో ఎం.విజయలక్ష్మమ్మ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాడు-నేడు పనులను పరిశీలించారు. మరుగుదొడ్లు అసంపూర్తిగా ఉండిపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. కొంతమంది అడ్డంకులతో ఆగిపోయినట్టు హెచ్ఎం చెప్పారు.

అశ్రద్ధ చేస్తే.. ఆరోగ్యం గుల్ల

నడవాలంటే కాళ్లు సహకరించాలి. ఏ పనైనా చేయాలంటే చేతుల్లో శక్తి ఇమిడి ఉండాలి. నిలబడాలన్నా, కూర్చోవాలన్నా, వంగాలన్నా, అటూ ఇటూ తిరగాలన్నా వెన్నెముఖ సహకరించాలి. శరీరం ఎముకల గూడుతో నిర్మితం. వాటిని ఆనుకుని ఉన్న కండరాలతో కలిసి ఉన్నదే మనిషి సామర్థ్యం. ఓ నిర్మాణానికి ఇనుప చువ్వలు ఎలా ఆధారమో, శరీరానికి ఎముకలు అటువంటివి. ఎముకల్లో పటుత్వం తగ్గిందో మనిషి జీవనయానంలో సమస్యలు మొదలవుతాయి. దైనందిన కార్యక్రమాలు దారితప్పుతాయి. వయసు పైబడుతున్న కొద్దీ ఎముకల పటుత్వం తగ్గడం సహజం. కానీ అది అనూహ్యంగా జరగకుండా చూసుకోవడమే మన విధి. ఇందుకు జీవన శైలిలో మార్పులతోపాటు ఆహార నియమాలు, శారీరక శ్రమ వంటి చాలా ముఖ్యం.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ఎముక అంటే కేవలం ఓ గట్టి పదార్థం కాదు. దాని మజ్జలో ఉత్పత్తయ్యే ఎర్ర రక్తకణాలు శారీరక ఆరోగ్యం కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఎముక ఆరోగ్యం దెబ్బతినడం అంటే అది గుల్లబారడం. ఎముక ఓ గొట్టంలాంటి నిర్మాణం. దాని మధ్యలో ఉండేదే 'మజ్జ'. ఎముక గుల్ల బారడం అంటే ఈ మజ్జ తన సహజ సిద్ధమైన సామర్థ్యాన్ని కోల్పోతుందన్న మాట. ఎముకలకు ఎప్పటికప్పుడు అవసరమైన కాల్షియం, ఇతర పదార్థాలు సంతృప్తిగా అందినప్పుడే అది ఆరోగ్యంగా ఉంటుంది. మనిషి ఆహారం నుంచే ఇవి శరీరానికి అందాలి. ఒకప్పుడు 90 ఏళ్లు వచ్చినా ఎముకల పటుత్వానికి ఢోకా ఉండేది కాదు. ఇప్పుడు చిన్న వయసులోనే కాళ్లు, కీళ్లనొప్పులు భయపెడుతున్నాయి. ఇందుకు ఎముకల పటుత్వం దెబ్బతినడమే కారణం. ఎముకలకు కీలక శక్తినందించే ఆహారాన్ని తీసుకోకపోవడం, వాటి పటుత్వానికి తీసుకోవాల్సిన చర్యలు తీసుకోకపోవడం సమస్యకు మూలం. మనిషి స్వయంకృతం కారణంగానే ఎముకలు బలం కోల్పోతున్నాయంటున్నారు నిపుణులు. ఆదివారం అంతర్జాతీయ ఆస్టియో పోరోసిస్ (ఎముకలు గుల్లబారే) డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

వృద్ధాప్యంలోనే సమస్య ఎక్కువ

ఎముకలు గుల్లబారే సమస్య సాధారణంగా వృద్ధాప్యంలోనే ఎక్కువగా కనిపిస్తుంది. గడచిన కొన్నేళ్లుగా యవ్వనంలో ఉన్న వారిలోనూ ఈ సమస్య తలెత్తుతోంది.

చిన్నవయసులోనే గుల్లబారుతున్న ఎముకలు

- కొందరిలో జన్యుపరమైన కారణాలతో సమస్య...
- పోషకాహారలోపం, శారీరక శ్రమ లేకపోవడం, కొన్ని రకాల మందుల వినియోగం వల్ల మరికొందరికి...
- సమస్య తెలిసిన వెంటనే జాగ్రత్తపడాలి
- తగిన చికిత్స తీసుకుంటే బయటపడే అవకాశం

నేడు అంతర్జాతీయ ఆస్టియో పోరోసిస్ డే

దీనికి అనేక కారణాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో హార్మోన్లు తగ్గిపోవడం వల్ల కాల్షియం పూర్తిగా తరిగిపోతోంది. దీనివల్ల ఎముకలన్నీ మెత్తబడి పోతున్నాయని నిపుణులు చెబుతున్నారు. యవ్వనంలోను, చిన్నారుల్లోనూ ఈ సమస్య కనిపించడానికి ప్రత్యేక కారణాలున్నాయంటున్నారు. జన్యుపరమైన కారణాల వల్ల కొందరిలో ఈ సమస్య వస్తుంది. అనారోగ్యానికి వాడే మందులు వికటించినా సమస్య తలెత్తుతుంది. ఇతర కారణాలు కూడా ఇందుకు కొంత దోహదం చేస్తాయి. ముఖ్యంగా ఆస్తమా, కీళ్లవాతానికి వినియోగించే మందులు, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగిన రోగుల్లో ఈ సమస్య అధికంగా ఉందని, దీనికి వారు వినియోగించిన మందులే కారణమని నిపుణులు చెబుతున్నారు. దీన్నే డ్రగ్ ఇన్‌డ్యూస్డ్ ఆస్టియో పోరోసిస్ అంటారు. వీటితోపాటు కాల్షియం లోపం ఎక్కువగా ఉన్న వారిలోను, హార్మోన్స్ లోపం ఉన్నా, థైరాయిడ్ సమస్య ఉన్నా, ప్రమాదాలు, ఇతర అనారోగ్య కారణాల వల్ల ఎక్కువ రోజులపాటు విశ్రాంతి తీసుకున్నా ఈ సమస్య బారినపడే అవకాశం ఉంది.



సమస్య వస్తే ఇబ్బందులే?

ఎముకలు గుల్లబారితే చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎముకలు గుల్లబారడం అంటే వాటి సహజ సిద్ధమైన సామర్థ్యాన్ని కోల్పోవడం. అంటే గట్టిగా రాయిని తలపించేలా ఉండే ఎముకలు పుల్లల్లా మారిపోతాయి. దీనివల్ల చిన్న ప్రమాదం జరిగినా, ఏ కారణంగానైనా కింద పడినా ఎముకలు విరిగిపోతాయి. శరీరంలో కాల్షియంతో పాటు విటమిన్-డి తగ్గిపోవడం, థైరాయిడ్ గ్రంథి పనితీరు అతిగా ఉండడం, మధుమేహం బారినపడడం వంటి సమస్య లతోపాటు వయసు మీదపడినవారు ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. నడుంనొప్పి, ఎత్తు తగ్గడం, ఎముకల్లో కదలికలు లేకపోవడం వంటివి ఈ వ్యాధి ప్రధాన లక్షణాలుగా చెప్పొచ్చు.

మందులు, ఆహారం...

ఆస్టియో పోరోసిస్ (ఎముకలు గుల్ల) సమస్యతో బాధపడే వారికి కొన్ని రకాల మందులను ఇవ్వడం ద్వారా కొంత మెరుగైన ఫలితాలు సాధించవచ్చును. శరీరానికి అవసరమైన కాల్షియం టాబ్లెట్లు, ఇతర రూపాల్లో అందించాల్సి ఉంటుంది. కాల్సిటోనిన్ అనే హార్మోన్‌ను రోగులకు అందిస్తారు. బైపాస్‌నేట్ అనే కొన్ని రకాల మందులను ఇస్తారు. వీటితోపాటు విటమిన్ డి అందేందుకు ఎండ తగిలేలా చేయడం, పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకునేలా చూడడం ద్వారా రోగి ఉపశమనం పొందేందుకు కృషి చేస్తారు. ముఖ్యంగా ఆహారంలో పాలు, యాపిల్స్, నట్స్, డ్రైఫ్రూట్స్ వంటివి ఎక్కువగా తీసుకోవాలి.

వ్యాయామం చేయాలి, పోషకాహారం తీసుకోవాలి



- డాక్టర్ శివానంద, ఆర్థో విభాగాధిపతి, కేజీహెచ్ సూపరింటెండెంట్

మహిళల్లో మెనోపాజ్ తరువాత, పురుషుల్లో 60 ఏళ్లు దాటితే ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. వేరే జబ్బుల వల్ల కూడా ఆస్టియోపోరోసిస్ వస్తుంది. మల్టిబుల్ మైలోమా, కొన్ని బోన్ ట్యూమర్స్ వల్ల కూడా వస్తుంది. ఈస్ట్రోజన్ హార్మోన్ మహిళల్లో తగ్గిపోవడం వల్లే మెనోపాజ్ తరువాత ఈ సమస్య తలెత్తుతుంది. దీనివల్ల హిప్, స్పైన్, రిస్ట్ ఫ్యాక్చర్స్ ఎక్కువగా అవుతుంటాయి. కేజీహెచ్‌లోని ఆర్థో విభాగానికి ప్రతిరోజూ 300 కేసులు వస్తే అందులో ఆస్టియో పోరోసిస్ కేసులు 45 నుంచి 50 కేసులు ఇవే ఉంటున్నాయి. అందులో 30 మంది వరకు మహిళలు ఉంటున్నారు. ఈ సమస్యను నియంత్రించేందుకు వ్యాయామం చాలా అవసరం. అదే సమయంలో పోషకాహారాన్ని కూడా తీసుకోవాలి. వ్యాయామం లేకపోవడం, కూల్ డ్రింక్స్ అధికంగా తాగడం, గంటలు తరబడి కూర్చుని ఉండడం, పోషకాహార లేమి, సూర్యరశ్మికి ఎక్స్‌పోజ్ కాకపోవడం వంటివన్నీ భవిష్యత్తులో ఈ సమస్య బారినపడేందుకు కారణమవుతాయి.

యుక్త వయసులో కాల్షియం డిపాజిట్ అయ్యేలా చూసుకోవాలి

- డాక్టర్ భవానీప్రసాద్, ఆర్థో విభాగాధిపతి, విమ్స్



ఆహార లోపం, వ్యాయామం లేకపోవడం వల్ల వయసు పైబడిన వారిలో ఎముకల బలం తగ్గుతుంది. స్మోకింగ్, ఆల్కహాల్ అలవాట్లు ఉన్న వారిలో కూడా ఈ సమస్య అధికంగా కనిపిస్తోంది. స్టెరాయిడ్ మెడిసిన్స్ అధికంగా వినియోగించడం, కొన్ని రకాల వ్యాధులు కూడా సమస్యకు కారణం. ముందుజాగ్రత్త తీసుకోవడం చాలా ముఖ్యం. 14-15 ఏళ్ల వయసులో కాల్షియం డిపాజిట్ శరీరంలోకి బాగా జరగాలి. దీనివల్ల వయసు పైబడిన తరువాత ఇటువంటి సమస్యలు నుంచి ఉపశమనం పొందేందుకు అవకాశం ఉంటుంది. వ్యాయామం తప్పకుండా చేయాలి. వెన్నునొప్పి, ఎముకలు విరిగి వచ్చిన వారిలో ఆస్టియో పోరోసిస్ బాధితులే ఎక్కువగా ఉంటున్నారు.

రైల్లో బాణసంచా తరలిస్తే చర్యలు

- వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ హెచ్చరిక

విశాఖపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైల్లో బాణసంచా, పేలుడు, మండే వస్తువులు వంటివి రవాణా చేయడం నేరమని వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రైల్వే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి పండుగ జరుపుకోవడానికి స్వగ్రామాలకు వెళ్లేవారు మ వెంట బాణసంచాను తీసుకెళ్లి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని, ప్రయాణికుల భద్రతకు తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశముందని సూచించారు. నిషేధిత వస్తువులు తరలిస్తే మూడేళ్ల జైలు శిక్ష లేదా రూ.వెయ్యి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని దీపావళి సందర్భంగా రైల్వే మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. ప్రత్యేక తనిఖీలు, నిరంతర నిఘా కొనసాగుతాయన్నారు. స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై కూడా ఈ వస్తువులతో కనిపిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. కేవలం ప్రయాణికులనే కాకుండా పార్శిల్ సర్వీసు ద్వారా రవాణా అయ్యే లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	234.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

ఎన్‌డీఏ పాలనలోనే సర్పంచులకు గుర్తింపు

- దీపావళి కానుకగా 3 సిలిండర్ల పథకం
- ఉద్దండపురం పైలట్ ప్రాజెక్ట్ పనులు త్వరలో ప్రారంభం
- చినదొడ్డిగల్లు పల్లె పండుగలో హోం మంత్రి అనిత

నక్కపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని, ప్రస్తుతం ఎన్‌డీఏ పాలనలో సర్పంచులకు ప్రభుత్వం మంచి గుర్తింపునిస్తున్నట్టు హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో శనివారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆమె పర్యటించారు. కలెక్టర్ విజయ్ కృష్ణన్‌తో కలిసి పలు సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో పంచాయతీలు ప్రగతి పథం వైపు పరుగులు పెడుతున్నాయన్నారు. దీపావళి కానుకగా ప్రభుత్వం 3 గ్యాస్ సిలిండర్ల పథకానికి శ్రీకారం చుట్టనున్నామని, అలాగే, ఆర్‌అండ్‌బీ రహదారుల నిర్మాణాలు పూర్తి చేస్తామని చెప్పారు. ఐదేళ్లపాటు నిలిచిపోయిన ఉద్దండపురం పైలట్ వాటర్ ప్రాజెక్ట్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. చినదొడ్డిగల్లులో సుమారు 15 ఏళ్ల నుంచి నిలిచిపోయిన పీహెచ్‌సీ భవనాన్ని పూర్తి చేసి, ఆస్పత్రి మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. శ్మశానవాటికల అభివృద్ధిపై తమ ప్రభుత్వం దృష్టి పెడుతుందని హోం మంత్రి చెప్పారు. ఆ గ్రామ మాజీ సర్పంచ్ వెలగా శ్రీను నేతృత్వంలో టీడీపీ కార్యకర్తలు, ప్రజలు హోం మంత్రి అనితకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో అధికారులతో పాటు, నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.



చినదొడ్డిగల్లులో సీసీ రహదారుల పనులకు శంకుస్థాపన చేస్తున్న హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయ్ కృష్ణన్



వరి పొలాలను పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత, అధికారులు

వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం

వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నట్టు హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం సాయంత్రం చినదొడ్డిగల్లులో కలెక్టర్ విజయ్ కృష్ణన్‌తో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరి పొలాలను పరిశీలించారు. ప్రస్తుతం వరి సాగు పరిస్థితిని ఏవో ఉమా ప్రసాద్ ఆమెకు వివరించారు. డ్రోన్ ద్వారా ఎరువులు, పురుగు, తెగుళ్ల మందుల పిచికారీ విధానాన్ని హోం మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు సహా కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కర్రసాము

... 5వ పేజీ తరువాయి

పడిపోయింది. ఇటీవల కాలంలో తిరిగి కర్రసాము పట్ల యువత ఆసక్తిచూపడం మొదలుపెట్టారు. కర్రసాము వ్యాయామంగా కూడా ఉపయోగపడుతుందని గుర్తిస్తున్నారు. పురుషులతో సమానంగా బాలికలు, యువతులు కూడా కర్రసాము నేర్చుకోడానికి పోటీపడుతున్నారు. నగరంలో ప్రస్తుతం నాలుగైదుచోట్ల కర్రసాము శిక్షణ కేంద్రాలు ఉండగా వాటిలో బాలికలు, యువతుల సంఖ్య ఇటీవల కాలంలో పెరుగుతోంది. ఆడపిల్లలు ఇంటి నుంచి బయటకు వెళితే తిరిగి వచ్చేంత వరకూ తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంటోంది. విద్యార్థినుల నుంచి ఉద్యోగినుల వరకూ అందరిలోనూ ఎక్కడ ఆకతాయిలు ఏం చేస్తారోనని భయం వెన్నాడుతుంటుంది. అలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు ఆత్మరక్షణకు కర్రసాము బాగా ఉపయోగపడుతుందనే భావన చాలామంది తల్లిదండ్రులు, యువతుల్లో ఏర్పడుతోంది. దీంతో వ్యాయామంగా కూడా కర్రసామును గుర్తిస్తున్నారు. అందుకే కర్రసాము నేర్చుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అదే సమయంలో కర్రసాములో నైపుణ్యం కలిగిన వారిలో కొందరు మరుగునపడిపోయిన ప్రాచీన యుద్ధకళను తిరిగి బతికించడానికి, భావితరాలకు ఆత్మరక్షణపై తర్ఫీదునిచ్చివారిలో ఆత్మవిశ్వాసం పెంచాలనే కోరికతో మరికొందరు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు.

వీఎంఆర్‌డీఏ సెంట్రల్ పార్క్‌లో లక్ష్మణ్ దేవ్ గత పదేళ్లుగా కర్రసాము నేర్పుతుండగా, ఇటీవల కాలంలో ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో రాము, బీచ్‌రోడ్డులో శ్రీను, వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కిరణ్ కర్రసాము శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందిన వారిలో కొందరు రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లి పతకాలను సాధించడం విశేషం.

కర్రసాముకు ఆదరణ పెరుగుతోంది: బీఏ లక్ష్మణదేవ్

ప్రాచీన భారతీయ యుద్ధకళను బతికించాలనే ఉద్దేశంతో పదేళ్ల కిందట కర్రసాములో శిక్షణ ఇవ్వడం ప్రారంభించాను. మొదట్లో ఇద్దరు ముగ్గురే వచ్చేవారు. రానురాను సంఖ్య పెరిగింది. గత మూడేళ్లలో నేర్చుకునేందుకు వచ్చేవారిలో బాలికలు, యువతులు ఎక్కువగా ఉంటున్నారు. కొందరు ఒకవైపు సంప్రదాయ కూచిపూడి, భరతనాట్యం నేర్చుకుంటూనే..మరోవైపు కర్రలు తిప్పి ఎదుటివారి మక్కలు విరగ్గొట్టే కర్ర సాములో నైపుణ్యం పెంచుకునేందుకు కృషి చేస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

రెండో రోజూ ప్రజాదర్బార్

... 5వ పేజీ తరువాయి

పోలీసుల సాయంతో తమకు అప్పగించిన లోకేశ్‌కు విజయనగరం జిల్లా సంతకవిటి మండలం బొద్దూరుకు చెందిన వావిలపల్లి వేణుగోపాలరావు, హేమలత దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. తమ పాలిట దేవుడువంటూ కొనియాడారు. నిరుపేద కుటుంబం కావడంతో ఉపాధికి సాయపడాలని కోరగా...అందుకు లోకేశ్ హామీ ఇచ్చారు. కూలిపనులు చేసుకునే వేణుగోపాలరావు దంపతులకు ముగ్గురు కుమారులు. బంధువుల ఇంట్లో ఉంటూ చదువుకుంటున్న వారి కుమారుడు చైతన్యనాయుడు ఒకరోజు ఇంటి నుంచి వెళ్లిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం లోకేశ్ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతిపత్రం అందజేశారు. దీంతో పోలీసులు రంగంలోకి చైతన్యనాయుడు ఫొటోతో పోస్టర్లు అతికించి గాలింపు చేపట్టారు. చివరకు హైదరాబాదులో ఉన్నట్టు గుర్తించి అక్కడకు వెళ్లి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఇంకా తమకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని నాయీ బ్రాహ్మణులు కోరారు. దివ్యాంగురాలైన తన కుమార్తెకు గత ప్రభుత్వం పింఛన్ నిలిపివేసిందని, తిరిగి పునరుద్ధరించాలని నగరానికి చెందిన పుక్కళ్ల అప్పలరాజు కోరారు. ఆయా సమస్యలను పరిశీలించిన లోకేశ్ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గ్రంథాలయం తీయకపోవడంపై అసంతృప్తి

కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన అనంతరం ఆయన నగరంలో విద్యా సంస్థల తనిఖీకి బయలుదేరారు. మార్గమధ్యంలో అక్కయ్యపాలెం నెహ్రూ బజార్‌లోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం వద్ద ఆగారు. ఉదయం 8 గంటలకు తెరవాల్సిన గ్రంథాలయం 9-45 గంటలకు కూడా మూసి ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాల పర్యవేక్షణకు ఒక ప్రత్యేకాధికారిని నియమించనున్నట్టు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

నెహ్రూ బజార్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను మంత్రి లోకేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రం లోని బాలలతో కొద్దిసేపు సరదాగా గడిపారు. ఏబీసీడీలు, రైమ్స్ వచ్చా?...అని అడగ్గా వారు ఆడుతూ, పాడుతూ సమాధానాలిచ్చారు. గుడ్లు, పౌష్టికాహారం సరఫరాపై టీచర్లను ఆరా తీశారు. విద్యార్థులకు చాక్లెట్లు పంచి వారితో కలిసి ఫొటో దిగారు.

క్రైం... crime news

కొబ్బరితోటల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణానికి ఆనుకుని ఉన్న జాతీయ రహదారి తోటాడ జంక్షన్ నుంచి కశింకోటకు వెళ్లే మార్గంలో కొబ్బరితోటల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి శనివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ టీవీ విజయ్ కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి సీఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పెట్రోల్ బంకుకు సమీపంలోని ఒక దాబాను ఆనుకుని ఉన్న కొబ్బరితోటల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్టు వీఆర్వో ఫిర్యాదు చేశారన్నారు. వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామని, మృతుడికి 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని, చనిపోయి సుమారు రెండు వారాలు అయి ఉంటుందని తెలిపారు. అతని శరీరంపై ఎటువంటి వస్త్రాలు లేవని, ఎటువంటి గాయాలు లేవని సీఐ తెలిపారు. క్లూస్ టీమ్ కూడా సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టింది. మృతుడు భిక్షగాడై ఉంటాడని అనుమానంగా ఉందని సీఐ తెలిపారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చ్యురీకి తరలించామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చిన దృశ్యం

ముంచంగిపుట్టు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారెల పంచాయతీ పెద్దపేట గ్రామ సమీపంలో మత్స్యగెడ్డలో గల్లంతైన గిరిజన యువకుడు మృతదేహం మూడో రోజు శనివారం లభ్యమైంది. పెదబయలు మండలం సీతగుంట పంచాయతీ రోగులపేటకి చెందిన కొర్రా వేణుగోపాలస్వామి వ్యవసాయ పనిముట్లు సానబెట్టేందుకు ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీ పెద్దపేట గ్రామానికి గురువారం నాటుపడవపై మత్స్యగెడ్డలో వస్తుండగా పడవ మునిగిపోయింది. ఈ ప్రమాదంలో వేణుగోపాలస్వామి గల్లంతయ్యాడు. దీంతో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశాలతో విశాఖపట్నంకు చెందిన ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సంఘటన స్థలానికి చేరుకొని రెండు రోజులుపాటు శ్రమించాయి. శనివారం మధ్యాహ్నం గెడ్డలో మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు తెచ్చారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ ఎస్ఐ వైకుంఠం ఆధ్వర్యంలో 15 మంది గజ ఈతగాళ్లు మత్స్యగెడ్డలో గాలింపులు చేపట్టి మృతదేహాన్ని కనుగొన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. ఈ గాలింపు జి.మాడుగుల సీఐ వెంకటరావు, తహసీల్దార్లు నర్సమ్మ, రంగారావు, ఎస్ఐలు రవీంద్ర, రమణ, సర్పంచులు పి.పాండు రంగస్వామి, మాధవరావుల పర్యవేక్షణలో జరిగింది.

146 కిలోల గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్టు

నక్కపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విశాఖ ఏజెన్సీ (ఏవోబీ) నుంచి కారులో 146 కేజీల గంజాయిని తరలిస్తుండగా శనివారం ఉదయం వేంపాడు హైవే టోల్ ప్లాజా వద్ద స్థానిక సీఐ కుమారస్వామి సిబ్బందితో తనిఖీలు జరిపి పట్టుకున్నారు. దీనిపై సీఐ అందించిన వివరాలివి... మహరాష్ట్రకు చెందిన రామేశ్వర్ చౌహాన్, రాబిన్ అనే వ్యక్తులు ఏజెన్సీ నుంచి గంజాయి తీసుకురావాలని మోమిన్ రీస్ జులా, ప్రకాశ్ మంగీలాల్ జయదేవ్‌కు పురమాయించారు. దీంతో ఈ ఇద్దరు కారులో ఈ నెల 11వ తేదీన విశాఖ చేరుకున్నారు. 15న రామేశ్వర్ చౌహాన్, రాబిన్ కూడా విశాఖ చేరుకున్నారు. శనివారం ఉదయం మోమిన్ రీస్ జులా, ప్రకాశ్ మంగీలాల్ జయదేవ్ కారులో 146 కేజీల గంజాయిని ముంచంగిపుట్టు సమీపాన కొనుగోలు చేసి కారులో మహరాష్ట్రలోని బీడ్ జిల్లాకు తీసుకెళ్తుండగా, వేంపాడు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు జరిపి స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చెప్పారు. కారులో రెండు కిలోల చొప్పున ప్యాకెట్లు 73 ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.4.38లక్షలు ఉంటుందన్నారు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో మధ్యవర్తులుగా వ్యవహరించిన రామేశ్వర్ చౌహాన్, రాబిన్‌ల కోసం గాలిస్తున్నట్టు చెప్పారు.

జల్ జీవన్ పనులకు గ్రహణం

... 5వ పేజీ తరువాయి

ప్రారంభం కాలేదు. మిగిలిన పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

ఈ పథకం పనులను మళ్లీ పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జల్ జీవన్ మిషన్ పథకం పనుల వివరాలపై జిల్లాల వారీగా నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లా గ్రామీణ నీటి సరఫరాల శాఖాధికారులు ఈ పనులపై సమగ్ర నివేదికను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన జల్ జీవన్ మిషన్ పనులు క్షేత్రస్థాయిలో ఏ విధంగా చేపట్టారు, గత ప్రభుత్వ గణాంకాల ప్రకారం పనులు జరిగాయా?, నిధులు పక్కదారి పట్టాయా? అనే కోణంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరాల శాఖాధికారులు వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించేందుకు సిద్ధమవు తున్నారు. గ్రామాన్ని ఒక యూనిట్‌గా కాకుండా కూటమి ప్రభుత్వం భవిష్యత్తులో కొన్ని గ్రామాలను కలిపి ఒక యూనిట్‌గా తీసుకొని వాటర్ గ్రిడ్‌లుగా జల్ జీవన్ మిషన్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు తెలిసింది.